# ప్రకృతితో(తో) నేస్తం

భావైక్యత తాలూకు స్నేహ మాధుర్యం,
అదో భాషకందని భావ ప్రపంచం,

\- జయప్రద

వేకువన లేచి, నైటీమీదే షాల్ కప్పుకుని ఒంటరిగా బయట కొచ్చాను. జివ్వుమంటూ చల్లగాలి. ఒక్క నిముషం ఇంకో అడుగు వేయలేననిపించింది క్షణం. బలవంతంగా నిల్చున్నాను. చలి తగ్గింది. ఒక్కడుగేసాను. మరలా ముక్కు జివ్వుమంది. షాల్ పైకెత్తి తలచుట్టూ కప్పుకున్నాను. ఆ చీకట్లో టార్చిలైట్ గుడ్డికాంతిలో తడుముకుంటూ వెళ్ళి కొండ కొసన ఒక తెల్లరాతిమీద ముడుచుకుని కూర్చున్నాను. చీకట్లోకి చూస్తున్నాను. చీకటిని ఆస్వాదిస్తున్నాను. కొద్దిసేపటికి తొలిసూర్యకిరణం నా మీదపడింది ఆ ప్రభాత కాంతిలో చుట్టూసౌందర్యాలు కనిపించీ కన్పించ నట్లున్నాయి. రవి కిరణాల వేడికి తట్టుకోలేక మంచు ముత్యాలు కరిగి పోతున్నాయి.

షాల్ తీసేసాను. ఇంకా చలిగాలే. మరలా కప్పుకున్నాను. 'ఇలాటి సమయంలో పాట పాడగలిగిన గొంతు తనకుంటే ఎంత బావుం డేది.' మెల్లగా లేచాను. అడవిపూల మొక్కల మధ్యగా నడుస్తూవెళ్ళి కొండ పైట్ రాళ్ళ గుట్టమీద కూర్చున్నాను.

అన్నా వదిన ఈ అరకువేలీలోని సౌందర్యాల్ని వదిలేసి ఆ క్వార్టర్స్‌లో ఏమి చేస్తున్నారో! నేను కథ వ్రాయటానికి తెచ్చుకున్న కాగితాలను బయటకు తీసి పక్కనపెట్టి ఒక రాయి ఏరి తీసి పేపర్స్‌మీద పెట్టాను.

"నే నిక్కడ కూర్చుంటే మీకేమైనా అభ్యంతరమా ?" ఉలిక్కిపడ్డాను. మోకాళ్ళమీద రెండు చేతులూ చుట్టేసి, కుడి భుజంమీదుగా క్రింది లోయలోకి, ఆ లోయలో మెలికలు తిరుగుతున్న రైలు పట్టాలవంక చూస్తూ తీపిగుర్తుల్ని నెమరువేసుకుంటున్న నేను ఉలిక్కిపడి తలెత్తాను.... నాకు కాస్తంత దూరంలో ఒక ప్రక్కగా నిల్చుని, తల కాస్త వంచి చూస్తున్న నిలువెత్తు యువకుణ్ణి చూచి కాస్త తత్తరపడ్డాను.

నా జవాబు కొరకు క్షణం ఆగిన అతను మరలా అర్థించాడు.

"ఇక్కడ నుండి లోయ వ్యూ చాలా బాగుంటుంది. కిరండల్‌నుండి మేంగనీస్ మోసుకుంటూ వచ్చే రైలు ఈ పట్టాలమీదుగా వెళ్ళేప్పుడు చూడడం చాలా థ్రిల్లింగ్‌గా వుంటుంది అందుకనీ...."

తేరుకుని "కూర్చోండి" అని మరల్తా నా అందమైన ప్రయాణపు ఘడియల్లోకి జారిపోయాను.

'నిజంగా తను ఈ రోజు అరకులోయలో వుందా ? ఎన్ని సంవత్సరాల కోరిక ! ఎన్నేళ్ళుగా బ్రతిమలాడితే ఈ సుందరమైన ప్రయాణానికి ఒప్పుకున్నాడు అన్న !'

తన కోరిక ఎంత బలవత్తరమైందో! కొన్ని వందల మైళ్ళ దూరాన్ని వెనక్కు నెట్టి, గూడూరునుండి తనను ఈ అరకులోయలోకి తోసేసిందీరోజు. విశాఖపట్టణంలో ఆర్. ఆర్. ఎక్స్‌ప్రెస్ ఎక్కిన ఓ గంట తర్వాత నుండి లోయలు, పచ్చని, చిక్కని చెట్ల తాలూకు అందాలలోకి ఒరిగిపోయింది తను.

భయంకరమూ, అద్భుతమూ అయిన లోయలు అందులో పరుగెట్టే మేఘాలు, ఇంద్రధనస్సు ఆకారంలో ఒక కొండని మరో కొండనీ కలిపే మేఘ మాలికలూ, అర గంటకీ, అయిదు నిముషాలకీ ప్రయాణాన్ని భయంకరమైన చీకటిలో ముంచే టన్నెల్స్ – దూరాన తారురోడ్డు, ఆ రోడ్డు ప్రక్కన వేగిస, ఊకు, కరకు, కంబ, నేరేడు, ఉసిరిగ చెట్లు, కొండమీద ఏటవాలుగా కాఫీ తోటలు.

రైలు కంపార్టుమెంటు వాకిలి దగ్గర రాడ్ పట్టుకుని కాస్త ముందుకి వంగి నిల్చుని రైలు ఇంజను తాలూకు ఒంపుల సోయగాలు తిలకిస్తుంటే, బ్రిడ్జిమీదుగా రైలు వెళ్ళేప్పుడు క్రింది అగాధంలోకి చూస్తుంటే – పరవశమూ, భయమూ సమపాళ్ళల్లో కలిసిన వింతైన అనుభూతి ! ఓహ్ ఏ మందమైన క్షణాలివి !

"అబ్బ! ఆ గూడ్స్ చూడండి ఎంత అందంగా మెలికలు తిరుగుతూ వస్తోందో !"

అతనివైపు నుండి వినవచ్చిన ఆ మాటలకి గతం తాలూకు అందమైన క్షణాల నుండి బయటపడి అతనివైపు చూచి వెంటనే తలత్రిప్పి అతను చూపించిన సజీవమైన అందాలవంక చూసాను. ముందు మూడు ఇంజన్లతో వెనక ఒక గార్డు పెట్టెతో మధ్యలో మాంగనీసు వేసుకున్న కొన్ని వేగన్లతో చిన్నపిల్లలు తాటాకుతో చేసుకుని దారంకట్టి లాక్కుని వెళ్ళే పాము బొమ్మలాగ ధనాధన్‌మని శబ్దం చేసుకుంటూ మెలికలు తిరిగి పోతోంది రైలు.

నేను అక్కడ కూర్చున్నప్పటినుండి ఇప్పటికి అలాటి రైళ్ళు మూడింటిని చూచాను. అయినా మరలా ఇదీ....ఇంకా చూడాలనేంత అందంగానే వుంది.

'అబ్బ ! ఆ గూడ్సు చూడండి ఎంత అందంగా వుందో !' అని

పరవశంగా అన్న ఆ యువకుడు, తన పొరపాటు అర్థం చేసుకున్న వాడిలా అన్నాడు.

"సారీ నన్ను పరిచయం చేసుకోలేదు. నా పేరు బిందు మాధవ్, మీ పేరు తెలుసుకోవచ్చా ?"

ఆ గూడ్సు కనుమరుగయ్యేంతవరకూ దానివంకే చూస్తున్న నేను చూపులు విడదీసుకుంటూ చెప్పాను.

"కారుణ్య"

"మంచి పేరు"

మరలా ఇద్దరం మౌనంలోకి దొర్లిపోయాముకానీ అరకులోయలో స్టేషన్‌కి మూడు కిలోమీటర్ల దూరానున్న క్వార్టర్సులోని మొదటి సూట్ లోకి రెండో సూట్‌లోకి ఆ రోజే దిగిన మా ఇద్దర్నీ మరో కొన్ని నిముషాల్లో ఆ రమణీయమైన ప్రకృతి మానసికంగా సన్నిహితుల్ని చేసేసింది.

"మీరూ జనవరిలోనే వచ్చారే !"

"చలిలోనే ఇలాటి అందాల్ని చూడాలి" పవిటచెంగు భుజంచుట్టూ కప్పుకుని, మరింత ముడుచుకుంటూ అన్నాను.

"నిజమే ! నాకూ అదే ఇష్టం."

సూర్యుడు కొండల వెనకనుండి ఆకాశంలోకి ప్రయాణం చేస్తున్నాడు. మా ప్రక్కగా కట్టి పూర్తిచేయకుండా వదిలేసిన హోటల్ తాలూకు వెలిసిపోయిన గోడలమీద సూర్యకాంతి మెల్లి మెల్లిగా చోటు చేసుకుంటోంది.

"నేను విజయవాడలో కలెక్టర్‌గా అపాయింట్ అయి ఓ సంవత్సరమైంది. ఆ ఊపిరి సలపని పని కొన్ని సమయాల్లో బాగున్నా ఒక్కొక్క

ప్పుడు ఒంటరిగా వుండాలనిపిస్తుంది అందుకని నాలుగురోజులు ఎరన్ లీవు పెట్టేసి వచ్చాను. క్యాంపు వేయించుకొని రావచ్చనుకోండీ....కానీ మరలా సిబ్బందీ....అదీ అప్పుడు ఒంటరితనం లభించదు ...."

నేను మాట్లాడలేదు. అతనివైపే చూస్తున్నాను. ముప్పై సంవత్సరాలుండవచ్చు, ఆ కళ్ళల్లో ఎంత తృప్తి !

"అన్నీ నేనే మాట్లాడేస్తున్నాను. నా గురించే చెప్పేసుకుంటున్నాను" అని ఆగి "మీరు...." అని మరలా ఆగిపోయాడు.

చటుక్కున తలెత్తాను. ఏదో చెప్పబోయి ఆగి మరలా తల వంచేసుకుని అన్నాను.

"నేను యమ్. ఎ. చదువుతున్నాను."

అలా అన్నతర్వాత అతని రియాక్షన్ కొరకు తలెత్తాను. అతని ముఖంలో ఆశ్చర్యం ఏమీ కన్పించకపోవడంతో గుండెలనిండా గాలి పీల్చుకున్నాను.

"మీరు ఏదో వ్రాస్తున్నట్లున్నారు. మీరు రచయితలా ?"సంబరంగా చూసాడు బిందుమాధవ్ నా ప్రక్కన రాతిమీదున్న కాగితాలు, పెన్‌వంక.

"ఏదో !" ఇబ్బందిగా కదిలాను. ఉన్నట్టుండి చల్లటిగాలి తెమ్మెర మా ఇద్దరినీ చుట్టుకోవడంతో వణికినట్టయి మరింత ముడుచుకున్నాను.

"మేఘం మనమీదుగా వెళ్ళినట్టుంది" అని నవ్వాడు మాధవ్.

"నిజం ! ?" అని పసిపిల్లలా సంబరపడి అటూ ఇటూ తిరిగి తన మీదుగా ప్రయాణంచేసిన మబ్బుతునక ఎటు వెళ్ళిందా అన్నట్టు చూస్తున్న నా వైపు ఆసక్తిగా చూస్తున్న మాధవ్ ఉలిక్కిపడ్డాడు.

"డాక్టరాంటీ ! నువ్విక్కడున్నావా ? మమ్మీ నిన్ను స్నానానికి పిలుచుకురమ్మంటోంది" ఎనిమిదేళ్ళ మా అన్నకూతురు అరుస్తూ వచ్చింది.

"మీ డాక్టర్ ఆంటీ ఎవరు పాపా !" అంటూ మాధవ్ తలెత్తి లేచి నిలబడ్డ నా కళ్ళల్లోకి చూసాడు. అవి అసహనంగా కదిలుంటాయి.

"అబ్బ ! ఆకాశంలో కొంగలబారు ఎంత అందంగా వుందో !" మాట మారుస్తూ గబగబ అన్నాను.

'మీ డాక్టరు ఆంటీ ఎవరుపాపా !' అన్న మాధవ్ అయితే ఆకాశంలో అందంగా ఎగిరిపోతున్న కొంగలబారు చూసి ఆ పరవశంలో ఆ ప్రశ్నకు జవాబుకోసం ఎదురుచూడాలన్న సంగతి మర్చిపోయాడుగానీ, మా పాపాయ్ మాత్రం ఫస్టురాంక్ స్టూడెంట్‌లా వెంటనే జవాబు చెప్పేసింది.

"మా కారుణ్య అత్త. నేను డాక్టర్ ఆంటీ ! అని పిలుస్తాను. నాకింకో అత్తవుంది తనని అత్తా ! అని పిలుస్తాను" ఆరిందలా అంది.

నా చెక్కిళ్ళు పాలిపోయాయి. వెళ్తున్నానన్నట్టు క్షణంలో సగం సేపు అతనివైపు చూసి వస్తానన్నట్టు తలూపి పద పాపాయ్ అక్కడనుండి నీరసంగా వెళుతున్న నా వైపు చిత్రంగా చూస్తూ వుండిపోయాడు అతను.

* * *

"ఏమండీ ! డాక్టర్‌గారూ !"

పద్మావతి బొటానికల్ గార్డెన్స్‌లో రోజా పువ్వులు విరగబూసిన పొదకేసి చూస్తున్న నేను విస్తుపోయి వెనక్కి తిరిగాను.

మనోహరంగా నవ్వుతూ అతను.

"ఇలా ఒంటరిగా వచ్చారేం ? మీ పాపాయ్ ఏదీ ?"

నేను ఒక్కసారిగా సర్వసంపదనూ పోగొట్టుకున్నట్టు అతని కళ్ళల్లోకి విచారంగా చూసి మూగదానిలా నిల్చుండిపోయాను.

నా ముఖంలోని అర్థంకాని భావాలకు జవాబు చెప్పుకోలేక "క్షమించండి. అతిచనువు తీసుకున్నట్టున్నాను" అనేసాడతను చప్పున.

"అలాంటిదేం లేదు కూర్చోండి" అని, ఆ పాల పన్నీటిపువ్వుల పాదాలచెంత కూర్చుని, జరిగి అతనికి కాస్త చోటు చూపించాను.

"మీరొక్కరే కన్పిస్తున్నారు" ఏదో మాట కలపాలన్నట్టు అడిగాను.

"చెప్పానుగా, రెస్ట్‌కోరకొచ్చాను. అసలు డ్రైవర్‌ను కూడా తీసుకొచ్చుండేవాడిని కాదు. కానీ మనమే డ్రైవ్ చేయాలంటే ఇలాంటి ప్రదేశాల్లో చాలా అందాలు మిస్ అయిపోతాము."

సన్నగా నవ్వాను.

అతను అలా నవ్వుతూనే, నా వైపు కుతూహలంగా చూస్తూ అన్నాడు.

"నా ప్రశ్నకు మీరు జవాబు చెప్పనేలేదు."

"మీరు ప్రశ్న అడిగితే కదా !"

"మీరు చక్కగా మాట తప్పిస్తారు." నవ్వాను.

"నవ్వి సరిపెట్టకండి డాక్టర్‌గారూ !" క్షణంలో నా ముఖం నల్లబడింది.

అతను నా ముఖంలోకి క్షణం చిత్రంగా చూసాడు.

"ఏమైంది అలా వున్నారేం మీరు ?"

కాస్త ఆత్రుతగా, కాస్త చనువుగా అడుగుతున్న అతను ఆ ఒంటరితనంలో, ఆ నిశ్శబ్దంలో ఆ భావైక్యతలో చాలా సన్నిహితుడుగా అన్పించాడు. చప్పున అనేసాను.

"మీరు నన్నలా పిలవకండి. పిలవాలనిపిస్తే పేరుపెట్టి పిలవండి చాలు."

"పోనీ అలాగే. కానీ మీరు నాకు అబద్ధం చెప్పారా ? మీ పాప అబద్ధం చెప్పిందా ?"

"మీరు నన్ను వదిలేలా లేరే !" అని కాస్త తేలిగ్గానే నవ్వాను. అతను మాట్లాడలేదు. కానీ నేను చెప్పబోయే జవాబుకొరకు ఎదురు చూస్తున్నవాడిలా కాస్త ముందుకువంగాడు. అతని దేహచ్ఛాయకంటే మరో ఛాయ ఎక్కువవున్న అతని కనుపాపలు ఆసక్తిగా చూస్తున్నాయి.

"క్షమించండి ఈ నాలుగు రోజులైనా నన్ను నేను మర్చిపోయి బ్రతకాలనుకున్నాను. మా పాపాయి పడనిచ్చింది కాదు.

"మిమ్మల్ని మీరు మర్చిపోయా ? .... అంటే ...."

నేను మాట్లాడలేదు. 'అసలు మాట్లాడడానికంతకంటే ఏముందనీ !' అతను రెండు చేతులు వెనక భూమిమీద ఆనించి వెనక్కు వాలాడు. నా కళ్ళల్లోకి నిశితంగా చూస్తూ అన్నాడు.

"మీ ముఖంలో అప్పుడప్పుడూ విచారాన్ని గమనిస్తున్నాను. మీ గురించి నాకు తెలుసుకోవాలని కుతూహలంగా వుంది. మీకభ్యంతరం లేక పోతే మీ విచారాన్ని పంచుకోవాలనుంది" ఈసారి అతని స్వరంలో చిలిపి తనం లేదు.

అతను అడిగినతీరు నన్ను మానసికంగా అతనికి దగ్గరచేసింది. సన్నటి స్వరాన అతనికి మాత్రమే విన్పించేంత తగ్గుస్థాయిలో అన్నాను.

"ఓ పది సంవత్సరాలు వెనక్కెళ్ళి, నా ప్రియ విద్యార్థి జీవితంలో, ఆ ఊహల్లో, ఆ అబద్ధంలో బ్రతకాలనుకున్నాను. బాధ్యతలకి, బరువులకు, పొగడ్తలకి, కృతజ్ఞతలకు, నమస్కారాలకు, విసిగిపోయి, ఇలా పరుగెత్తుకొచ్చాను. నా కోరికలకు అతీతంగా పదిసంవత్సరాలు ఇరుకు బ్రతుకులో ఇరుక్కుపోయి, ఊపిరి తీసుకోవడానిక్కూడా వ్యవధి లేనంతగా

ఇరుక్కుపోయిన నేను, ఈరోజు వెనక్కు తిరిగిచూసుకుంటే, నేనేం పోగొట్టుకున్నానో నా కర్థమైంది. నా ప్రమేయం లేకుండా, పదిసంవత్సరాల కాలం నాకో గొప్పతనాన్ని, పెద్దరికాన్ని మాత్రమిచ్చి, నా అందమైన జీవితాన్ని బలి తీసుకుంది. నేను ఎలాంటి మనోవికాసం లేకుండా గడి పేసిన ఈ పది సంవత్సరాల కాలాన్ని దాటుకుని, వెనక్కి వెళ్ళి చెప్పానుగా అబద్ధపు విద్యార్థి జీవితంలో కొన్ని రోజులైనా బ్రతకాలనే కోరికతో - మీకు చెప్పిన అబద్ధమది" ఆగి పేలవంగా నవ్వాను.

అతను మాట్లాడలేదు. నేను చెప్పింది అతనికి బొత్తిగా అర్థం కాకపోలేదుగానీ, దానిని పూర్తిగా అనలైజ్ చెయ్యడానికి ప్రయత్నిస్తు న్నట్టున్నాడు.

నేనూ అతనిని అతని కన్‌క్లూజన్‌కు వదిలేసాను.

చాలాసేపటి తర్వాత సర్దుకుని కూర్చుని, అరచేతుల కంటుకున్న ధుమ్ము దులుపుకుంటూ నావైపు చూసాడు.

"మీ వయస్సెంతుంటుందీ."

నాకు నవ్వొచ్చింది.

"ముప్పైపైన మరో మూడు."

"నేను నమ్మను. మీరు మరలా అబద్ధం చెప్తున్నారు" నేను కాస్త పెద్దగా నవ్వాను.

"నిజం. నేను మెడిసన్ పాస్ అయి పది సంవత్సరాలయింది. లెక్కేసుకోండి."

"అతను నవ్వేసాడు."

"పోనివ్వండి. వయస్సెంతయిందనేది ప్రశ్నకాదు. ఆ వయస్సుకు మనమేం చేసామనేదే మనకు తృప్తి నిచ్చేది."

"కాదు. ఒక్కోసారి వెనక్కు తిరిగి ఆలోచించుకుంటే చాలా విచారంగా వుంటుంది. నేనెంత పోగొట్టుకున్నానా అన్పిస్తుంది."

"ఎందుకు మీరలా బాధపడుతున్నారు ? మీ మాటలనుబట్టి చూస్తే మీరు బిజీప్రాక్టీషనర్‌లాగున్నారు- అంటే మీరు ఏదోకొంత మీ పేషంట్లకు న్యాయం చేయకపోతే ... మిమ్మల్ని అంతమంది అలా విసిగించరు.

"నిజమే ! నా ప్రియమైన పేషంట్లు నన్ను విపరీతంగా అభిమానిస్తారు. కానీ నాలో ఎందుకింత అసంతృప్తి !"

మరలా అతనే అన్నాడు.

ఒక్కోసారి విపరీతమైన అభిమానం, మోయలేనంత బాధ్యతలు, మనిషిని తరిమికొడతాయి డాక్టరుగారూ !"

నేను గబగబ అసహనంగా తల అడ్డంగా ఊపేసాను.

"ప్లీజ్. అలా పిలవకండి."

"సారీ."

"మరోలా అనుకోకండి. చెప్పానుగా, నేను పది సంవత్సరాల వెనక్కెళ్ళి బ్రతకడానికొచ్చానని, ఈ మధ్యకాలంలో నన్నందరూ 'గారూ!' అని పిలవడం ... నేను ఆ గారుతో లేని పెద్దరికాన్ని నెత్తిన పెట్టుకుని అందరినీ ఆశీర్వదించే పెద్దదానిగా పిలవడం ... నా వయసు దొంగిలించబడి ... ఆగిపోయాను. మాధవ్‌కు అర్థమయింది.

"ఓ.కే. అలాగే కానివ్వండి. మీ ఊహా చిత్రాన్ని నేనెందుకు భగ్నం చేయాలి ?"

అలా అనేసిన అతను లేచి ఆ తోటలో అందమైన ప్రదేశాలన్నింటినీ ఫోటోలు తీసుకోవడంలో నిమగ్నమయిపోయాడు. అలా ఎంతో

సభ్యతగా మాట్లాడి లేచి తన పనిలో తాను లీనమయిపోయిన ఆ యువకుడు నాకు చాలా నచ్చాడు.

నేను లేచి రోజాపువ్వు కోసుకోబోయాను. నా దొంగతనానికి సాక్ష్యంగా రోజా ముల్లు నా చేతిమీద ఎఱ్ఱటి గీతను సృష్టించింది!

అక్కడినుండి నడుచుకుంటూ ఒంటరిగా తోటంతా తిరిగేసాను. అందమైన ప్రకృతిలో ఏదో వ్రాయాలన్నంత భావావేశం నన్ను కుదిపేసింది. కానీ నా మనసులో ఏ కథా వస్తువూ స్పష్టంగా రూపం దాల్చడం లేదు. ఆ భావాల ప్రసవవేదనలో వుండగానే దూరాన మాధవ్ రెండుగా చీలిపోయిన ఒక చెట్టు కానుకుని దీర్ఘంగా ఎటో చూస్తూ కన్పించాడు. ఆ చెట్టు ఆకారం చీలికలు చీలికలుగావుండి అతనికి అందమైన బ్యాక్‌గ్రౌండ్‌ను సృష్టించాయి. అలా అతని ముఖం ప్రక్కనుండి దూరంగా చూస్తే, ఎంతో హుందాగా వున్న కొండలూ, పచ్చటి ప్రకృతి మహా అద్భుతంగా వుంది. 'అలా ఫోటో తీసుకుంటే ఎంత బాగుంటుంది!'

కెమెరా అన్న దగ్గరుండిపోయింది. నా కోరికను రెసిస్ట్ చేసుకోలేకపోయాను. అతని దగ్గరగా గబగబా నడిచి "ఆ కెమెరా కాస్త ఇస్తారా?' అన్నాను.

అతను ఉలిక్కిపడ్డట్లు చూచి, భుజాన వున్న కెమెరా తీసి నాచేతి కందించి అక్కడనుండి కదలబోయాడు.

"ప్లీజ్ కదలకండి. మీ స్నాప్ ఒకటి తీసుకుంటాను." నేను కాస్త తీరిగ్గా అలోచించుంటే ఆ అపరిచిత యువకుణ్ణి 'కదలకండి. మీ స్నాప్ ఒకటి తీసుకుంటాను' అనగలిగి వుండేదాన్నికాదు.

"ఓ కే. తీసుకోండి. అని మరలా అదే పొజిషన్‌లో నిల్చుండిపోయాడు."

నేను అంతా సర్దుకుని అతని ఫోటో తీయడానికి ఓ నిమిషం పట్టింది. నిముషంసేపు అతను ఓపిగ్గా అలాగే నిల్చుని, నేను కెమెరాని క్లిక్‌మని పించగానే కదిలి నాతో నడుస్తూ అన్నాడు.

"మీరు నా ఫోటో తీసింది నా కెమెరాతో."

అతని భావం నాకు బోధపడింది.

"మీరు ఆ ఫోటో నాకు పంపిస్తారు" అన్నాను కాస్త గడుసుగా.

అతను స్నేహపూర్వకంగా నవ్వేసాడు.

"మా అన్నావాళ్ళు వెళ్ళి అప్పుడే రెండు గంటలయింది ఇంకా రాలేదు" నాలో నేననుకున్నట్టుగా అన్నాను. క్రితంరోజే మాధవ్‌ని అన్నయ్యకు, వదినకు పరిచయం చేసాను నేను.

"ఎక్కడికి కెళ్ళారు ?"

మా వదినను, మా పాపాయ్‌ను క్వార్టర్సులో వదిలి రావడానికి వెళ్ళాడు.

"అదేం ! జలపాతం చూడరూ ?"

"మా వదిన ఇక నడవలేననేసింది." సరుగుడుచెట్ల ప్రక్కగా నడుస్తూ మాట్లాడుకుంటున్నాము మేము.

"మీకు విశాఖనుండి టాక్సీ ఎంగేజ్ చేసుండాల్సింది."

"మీకు చెప్పానుగా ఆ లగ్జరీ లైఫ్‌నుండి పారిపోవడానికే నేనిక్కడ కొచ్చింది. తలెత్తి సరుగుడుచెట్ల చిటారు కొమ్మలమీద తలక్రిందవేసి కాళ్ళతో ఆ కొమ్మలు పట్టుకుని వేళ్ళాడుతున్న గబ్బిలాలను చూస్తూ అన్నాను.

"మరి వాటర్‌ఫాల్స్ కెలా వెళ్తారు ?"

ఇబ్బందిగా నవ్వేసాను.

"పోనీ మా కార్లో వెళ్దాం రండి.

"థ్యాంక్స్. నాకు .... " ఆగిపోయాను. అతను అర్థమయినట్టు నవ్వాడు.

"మా అన్నయ్య ఇంకా రాలేదు" మరలా అన్నాను. తొందరగా జలపాతం దగ్గరకు వెళ్ళాలనుంది నాకు పైగా ఆ అపరిచిత వ్యక్తి నా కొఱకు, నాకు తోడు నివ్వడానికి అంత సేపు అక్కడే వున్నాడేమోననే మొహమాటం కూడా వుంది.

"ఆర్ అండ్ బి క్వార్టర్సుకెళ్ళి రావడమంటే తమాషానా ? మూడు కిలోమీటర్లు నడిచివెళ్ళి నడిచి రావాలి కదా!"

"కాదు అద్దె సైకిల్‌మీద వెళ్ళారు .... పోనీ ! మీరెళ్ళండి. నాకేం భయంలేదు. మా అన్నయ్య వచ్చాక మేమిద్దరం వస్తాము. జలపాతం దగ్గర కలుసుకుందాము."

"భలేవారే !" అని ఆగి,

"నా స్నేహం మీకు విసుగ్గావుందా ? మీకు ఒంటరితనం కావాలంటే నేనలా దూరంగా వెళ్తాను. కానీ మిమ్మల్నిలా పూర్తిగా ఒంటరిగా వదిలేసి ఎలా వెళ్ళిపోనూ ?"

"నాకు చప్పున జవాబు చెప్పడానికి మాటలు దొరకలేదు. అతని స్నేహం నన్నంతలా కదిలించింది.

నిజానికి అతని స్నేహం నాకు చాలా హాయిగా వుంది.

మరలా అతనే మొదలెట్టాడు

"కారుణ్యగారూ ! మనిషనేవాడికి, స్నేహం, బాంధవ్యం తప్పని సరిగా కావాలి. కానీ ఒక్కోసారి వాడికే, ఈ బాంధవ్యాలనుండి, స్నేహాల నుండి, గందరగోళంనుండీ కొంత ఒంటరితనం కావాలనిపిస్తుంది. అలా అన్పించని వ్యక్తులుంటే, వాళ్ళు ఒక రకంగా అదృష్టవంతులు, మరోరకంగా శాపగ్రస్తులు ...."

"నేను ఈసారికూడా మాట్లాడలేదు. అతని మాటలను మననం చేసుకుంటున్నాను."

"నిజం కారుణ్యగారూ! ఎవరైనా పొరపాటున-చెయ్యెత్తి తల మీద వెంట్రుకలు సవరించుకోబోతే, ఆ చెయ్యెత్తింది నాకు నమస్కారం చెయ్యడానికే అన్నంత భ్రమలోకి తోసేసింది. నా ప్రొఫెషన్ నన్ను. ఆ భ్రమనుండి బయటపడడానికే నేను ఈ ఒంటరితనాన్ని కోరి ఇలావచ్చాను. ఇంచుమించు మీరూ అదే స్థితిలో వుండి వుండాలి. మీ ఒంటరితనాన్ని నేను దొంగిలించడం చాలా అన్యాయం. చూడండి నేనలా దూరంగా కూర్చుంటాను. మీ అన్నయ్య వచ్చాక నాకు చెప్తే, నేను వెళ్తాను" అంటూనే అతను రెండడుగులు నాకు దూరంగా వేసాడు.

నేను కంగారుగా అతనిని ఆపే ఉద్దేశంతో అతని చెయ్యి పట్టుకోబోయి ఆగిపోయాను.

"లేదు....లేదురండి. అలావెళ్ళి ఆ వెదురు గుడారంలో కూర్చుందాం ఇక్కడ కాస్త ఎండగా వున్నట్టుంది."

## 3

కారు ఆ గతుకులరోడ్డుమీద, మా ప్రక్కగా అదురుతూ వెళ్ళిపోయింది. కారులోనుండి నన్ను చూసి పలకరింపుగా నవ్వాడు మాధవ్.

నన్ను ముందు కూర్చోబెట్టుకుని అలవాటు తప్పిపోయి, కాబోలు అద్దె సైకిల్ భారంగా తొక్కుతున్న అన్నయ్య శివశంకర్ ఒక చెయ్యి సైకిల్ హాండిల్‌మీదనుండి తీసేసి నా నెత్తిన సన్నగా మొట్టి,

"చూడూ - అతనలా కారులో వెళ్తూ, మనవైపు చూస్తూ నవ్వడం, నీకసహ్యంగా లేదూ!" అన్నాడు.

వెనక్కి తిరిగాను.

"లేదు శివా! నాకు చాలా థ్రిల్లింగ్‌గా వుంది. ప్లీజ్ దాన్ని నువ్వు స్పాయిల్ చెయ్యకు. ఇక్కడ మనకు తెలిసినవాళ్ళెవరూ లేరు."

ఆ కొండప్రాంతంలో, తొమ్మిది కిలోమీటర్ల దూరం నడిచే ఓపికలేక, మరో గత్యంతరం లేక మూడో సూట్‌లోవున్న దంపతుల సలహామీద సైకిల్ అయితే ఎక్కాను గానీ ఎంత దిండువేసుకుకూర్చున్నా రాడ్ ఒత్తుకుంటూనే వుంది. సైకిల్ హ్యాండిల్ అటూఇటూ కదిలించినప్పుడు అది గుచ్చుకుని బాధపెడుతూనే వుంది. అయినా ఇది నాకు కొత్త అనుభవం. 'అలా స్పీడ్‌గా సైకిల్ పోతూవుంటే నెత్తిమీద, ప్రక్కల.... మరే ఆచ్ఛాదనా లేకుండా ఎంతో ఫ్రీగా, ఎంతో ఓపన్‌గా ఆ పరుగెత్తే పచ్చటి ప్రకృతిని చూడడం. ఓహ్! ఏం గొప్పగా వుంది! ఇలాంటి అనుభవం చస్తే మా ఊర్లో దొరుకుతుందా?'

"అటుచూడు, అటుచూడు, ఆ కొండ - కొండమీద పచ్చికలాటి చెట్లు పెట్టనికోటలా, పూర్తిగా చెక్కని శిల్పంలా ఎంత అందంగా వున్నాయో!"

నా ఉత్సాహంలో అన్నయ్య పాలుపంచుకోలేదు. పైగా విసుక్కున్నాడు.

"అవన్నీ తీరిగ్గా డెస్టినీ చేరాక చూద్దాంగానీ, నువ్వు సరిగ్గా కూర్చో. ఇది కారుకాదు నీ ఇష్టం వచ్చినట్టు కదలడానికి. నువ్వు అలా గెంతావంటే ఇద్దరం అక్కడ అలా ప్రక్కకి చూడు ఆ ముళ్ళపొదల్లో వుంటాం."

నేను గడుసుగా నవ్వేసాను.

"పోనీ అదీ కొత్త అనుభవమేకదా !" నేను వెనక్కి తిరగలేదు గానీ, నావైపు చిరాగ్గా చూసుంటాడు శివా. అతనికి మొదటినుండీ ఇలాంటి వంటే గిట్టదు. నా పోరువల్ల బయలుదేరాడు. ఎప్పుడైనా ఇలా నాకు తోడుగా వస్తే, నాకు కారుని, డ్రైవర్‌ని, పాపాయ్‌ని అప్పజెప్పేసి తను హాయిగా లాడ్జిలో పేకాడుకుంటుంటాడు ఎవరితోనైనా స్నేహం కలిపేసి. కానీ అసలు నాకు అలా బయటకెళ్ళగలిగే అవకాశాలే చాలా తక్కువ. అలా ఎప్పుడైనా అవకాశం కలిసివచ్చినా, నాకు కంపెనీ ఇవ్వడానికి ఒక్కరూ ముందుకురారు. 'అప్పుడెంత నిరాశగా, విరక్తిగా వుంటుందనీ !'

"అదేమిటీ ? దూకేసావేమిటీ?" నేను సైకిల్ మీదినుండి దిగేయగానే అలా సైకిల్ ఆపుతూ కంగారుగా అన్నాడు శివా.

"అలా వెళ్ళిపోవడమేనా ? ఏమిటన్నయ్యా ! కాసేపిక్కడ కూర్చుందాం."

"భలేదానివే ! ఎక్కు ఎక్కు. ఇంకా చాలాదూరం వుంది జలపాతం. అక్కడ కూర్చుందాంలే."

"అక్కడ ఈ చెట్లు వుండవుగా ?"

"అక్కడ ఈ చెట్లేం వుండవుగానీ, ఇంకో చెట్లుంటాయిలే. ఎక్కు ఎక్కు" నా పరవశానికి మాటిమాటికీ మా శివాకు కోపమూ, విసుగూ రెండూ వస్తూనే వున్నాయి. కానీ మా ఇద్దరిమధ్య వుండే స్నేహంతో పాపం చాలా శ్రమపడిపోతున్నాడు. మా ఇద్దరిమధ్య వయస్సు తేడా పది నిముషాలు. మేమిద్దరం మా అమ్మ గర్భంలో కలిసి పెరిగిన వాళ్ళం. పది నిముషాల పెద్దరికం శివాది.

"నిన్ను బాగా విసిగిస్తున్నానుకదా శివా" అంటూ మరలా సైకిల్ ఎక్కి కూర్చున్నాను.

"కానీ.... కానీ ... నాకు తప్పేదేముంది ?"

మా అన్నని నేనెంత విసిగిస్తున్నానో తను అంతగా నా భావుకత మీద చన్నీళ్ళు చల్లుతున్నాడు ప్రతి స్టెప్‌లోనూ"

మరలా మా సైకిల్ ప్రయాణం మొదలయింది. అక్కడ ప్రజలకు ఈ వాహనం - దానిమీద జంటలు అలవాటయిపోయినట్లుంది. అంతగా వింతగా చూడడంలేదు.

*　　　　*　　　　*

"ఇక దిగు. ఇక్కడ నుండి ఇక నడవాలి" దూకేసాను.

చుట్టూ పచ్చగా ఆకాశాన్నంటే కొండలు, దూరాన జలపాతం తాలూకు నీళ్ళహోరు. ముగ్ధురాలనై చూస్తూ నిల్చుండిపోయాను. అన్న సైకిల్ అక్కడ టీచర్ ఇంట్లో పెట్టేటైమ్‌లో నేను అక్కడ గుంపుగాచేరి తలలు వంచి వ్రాసుకుంటున్న పిల్లలను చేరాను. అక్కడ కొండమీద మరో కొండ పాదాలచెంత చిన్న ఊరుంది. ఆ ఊరి వాళ్ళను మాట్లాడించ డానికి ప్రయత్నించాను. కానీ వాళ్ళది ఒరియా భాష. వాళ్ళ కట్టు భలే చిత్రంగా వుంది. ఆడపిల్లలు ఆరేడేళ్ళ వాళ్ళు కూడా చీర కట్టారు. ఆ చీరకు కుచ్చిళ్ళు వుండవు. సరిఅయిన పవిటా వుండదు. చాలా పొట్టి పవిట తీసి, దాని కొస మెడచుట్టూ చుట్టి దాన్ని తీసి ముందు దోపేస్తారు.

మాస్టారిని పలకరించాను.

ఆయన కాస్త సిన్సియర్ మాస్టారులాగున్నారు. "ఈ పిల్లలను మనమే వాళ్ళ ఇళ్ళకెళ్ళి పిల్చుకురావాలండీ. బొత్తిగా చదువుమీద ధ్యాస లేదు. గవర్నమెంటు మటుకు వీళ్ళమీద చాలా ఖర్చు పెట్టేస్తోంది" అని వాపోయారు.

ఓ రెండు గ్లాసుల మంచినీళ్ళు తాగి సైకిల్ తొక్కిన అలసట తగ్గించుకుని వచ్చాడు శివా.

"పద కారుణ్యా"

ఇద్దరం కలసి ఒక సన్నటి బాట వెంట నడవడం ప్రారంభించాం. ఎప్పటికప్పుడు మరికొన్ని గంటలు ఈ అందాలకు దూరమైపోతాననే చింతతో, ఆర్తిగా ఆ కొండలవంక, లోయలవంక చూసుకుంటూ వెనకబడి పోతూనే వున్నాను.

"అబ్బ ! శివా ! ఇక్కడనుండి లోయలోకి కాలిబాట వుంది. అలా వెళ్దాంరా శివా" నాలుగడుగులు ముందెళ్తున్న అన్నయ్యను పిలిచాను.

నేను పిలుస్తున్నానని నా ధ్వనినిబట్టి పోల్చుకున్నాడుగానీ నేనడిగిం దేమిటో అర్థంగాక మరలా వెనక్కు నడిచి వచ్చాడు శివా.

"ఏమైంది కారుణ్యా !"

"చూడూ, ఆ లోయలోవెళ్ళి అటునుండి జలపాతానికి దారున్న ట్టుంది – ఆ కొండ లైట్ రాళ్ళమీదుగా వెళ్దామన్నయ్యా"

క్షణం ఆలోచించాడు శివా. నేను చూపించిన దారి వంక చూశాడు. ఆ దారి అంత సవ్యంగా లేదు. మట్టి, రాళ్ళు. కొద్దిగా కాలు జారిందంటే నిలదొక్కుకునేలా లేదు. తల అడ్డంగా వూపేసాడు.

"వద్దు. రిస్కు అవుతుంది."

"రిస్కు లేకుంటే థ్రిల్ ఏముంటుంది ? ప్లీజ్ నువ్వున్నావుగా"

"వద్దమ్మా. నేనే నిలదొక్కుకోలేననిపిస్తోంది."

ఎంత బ్రతిమలాడినా శివా ఒప్పుకోలేదు. నాకు చాలా నిరాశగా అన్పించింది. నీరసంగా మరలా అన్న వెనకాల నడవడం ప్రారంభించాను. అడుగులేసేకొందీ జలపాతం తాలూకు మధురమైన శబ్దాలు మరీ దగ్గరగా

విన్పిస్తున్నాయి. నాకు చాలా టెన్షన్‌గా వుంది. సినిమాలలో చూడడమే గానీ, ఇంతవరకు జలపాతాన్ని చూడనేలేదు నేను.

* * *

"అబ్బ! ఎంత బాగుందో!" కొండలమీదనుండి దుముకుతూ ప్రవహిస్తున్న నీటిని చూసి పరవశంతో గెంతబోయిన నేను ఆగిపోయాను. నీటిధార కన్పించినంత మేర ఎక్కి ఒక కొండరాయిమీద కూర్చొనున్న మాధవ్ మరలా పలకరింపుగా నవ్వాడు. నేను బదులుగా నవ్వేసి అన్నయ్యవైపు తిరిగాను.

"శివా! అక్కడకెళ్దాం."

అన్నయ్య నా వైపు కోపంగా చూసాడు. మాటిమాటికి అన్నయ్య అలా పెద్దమనిషి తరహాగా నన్ను మందలించడం నాకు బొత్తిగా నచ్చడం లేదు. బయటకొచ్చినప్పుడైనా మన ప్రిస్టేజి, పెద్దరికం కాస్త మూటకట్టి ప్రక్కన పెట్టకపోతే ఎలా? ఈ అందమైన ప్రకృతిలోకూడా కట్టుబాట్లు అయితే ఎలా?

నా ముఖంలో భావాలు కనిపెట్టినట్టున్నాడు శివా. "చూడు. ఆ రాళ్ళు ఎంత నున్నగా వున్నాయో! నువ్వు ఎక్కలేవమ్మా" అన్నాడు సంజాయిషీ ఇస్తున్నట్టుగా.

నిజానికి శివా చెప్పేది నిజమే. నా ఆర్తికొద్దీ అడిగానేగానీ, నాకు తెలుసు నేను ఎక్కడం ప్రారంభించిన మరుక్షణమే ఆ అందమైన జలపాతం తాలూకు ప్రవాహంలో లీనమైపోతాను. అసలే నాకు కాస్త సెంటర్ ఆఫ్ గ్రేవిటీ తక్కువ. అందుచే సంతృప్తిపడి జలపాతం పాదాల దగ్గర నా పాదాల్ని ఆ జలపాతం నీళ్ళలో వుంచి ఆడిస్తూ, ఒంపులు తిరుగుతూ గెంతే నీటిధారవైపు చూస్తూ కూర్చున్నాను. అలా నేను కూర్చున్న అరగంటలో వందసార్లయినా నసుక్కున్నాడు శివా.

"ఇంకేముందిక్కడ పోదామా ?"

నేను అసలు మరో గంట లేవదల్చుకోలేదు. అన్నయ్య అభ్యర్థనను ఆ జలపాతపుహోరులో వినిపించుకోనట్లుగా నటించి, మాట్లాడకుండా ఊరుకున్నాను. నాతో విసిగిపోయిన శివా నాలుగు గజాలు వెనక్కెళ్ళి అక్కడ ఓ దిమ్మెమీద కూర్చుని, తెచ్చుకున్న పకోడీ పొట్లాలు విప్పితినసాగాడు.

మాధవ్ కొండమీద నుండి ఎప్పుడు దిగాడో నాకు కాస్త దూరంగా వచ్చి నిల్చుని మరో ప్రక్కనున్న కొండలవైపు నిశ్శబ్దంగా చూస్తున్నాడు. అతనిని అలా చూడగానే నాకు తోడు దొరికినంత సంబరంగా అన్పించింది.

"అబ్బ ! అటు చూడండి, ఆ కొండ, ఆ కొండమీద చెట్లు, పచ్చటి పట్టు తివాచీ పరచినట్టు లేదూ"

మా అన్న మా సైకిల్ ప్రయాణంలో విసుక్కున్న నా ఈ భావ పారవశ్యానికే అతని కళ్ళు మెరిసాయి.

"నిజం ! కారుణ్యగారూ ! ఇక్కడ ఒకవైపు చూసి, అబ్బ! ఎంత సౌందర్యం అనుకునేంతలో, మరోవైపు మహాద్భుతం అన్పించేలా వుంది ప్రకృతి. అసలు ఈ అరకులో సౌందర్యం లేనిదేమిటో మనం సాధించైనా చెప్పగలమా ?"

నేను మాట్లాడలేకపోయాను. నా భావ పారవశ్యాన్ని పంచుకునే మరోవ్యక్తి నా కిప్పటికి తారసపడ్డాడు. నా చిన్ననాటి స్నేహితులుగాని, అక్కచెల్లెళ్ళుగాని, ఆఖరకు ఒకేసారి ఒకే గర్భంనుండి ఒకే పేగును తెంచుకుని పుట్టిన శివాకు కూడా నా ఊహలు, నా కోర్కెలు చాలా పిచ్చిగా వుంటాయి.

"జలపాతం మీకు నచ్చిందా?" నాకు కాస్త దూరంలో ప్యాంటుపైకి

లాక్కొని కూర్చుంటూ అన్నాడతను. ఎప్పుడూ విచ్చుకోనుండే అతని పెదాలమీద చిరునవ్వు చాలా అందంగా వుంటుంది.

"అద్భుతంగా వుంది."

"నేను మాత్రం కాస్త నిరాశపడ్డానండీ కారుణ్యగారూ ? జోగ్ ఫాల్స్ చూసాక ఇది, ఇంతదూరం శ్రమపడి రావాల్సినంతది కాదనిపించింది."

నేను సన్నగా నవ్వాను.

"మీరు జోగ్‌ఫాల్స్ చూసేసి, ఇది బాగాలేదని నాకు చెప్పడం అన్యాయం. నా ఈ సుదీర్ఘమైన జీవితంలో చూస్తున్న మొదటి జలపాత మిది. పైగా ఇంతదూరం రావడం నాకు శ్రమ అన్పించలేదు. సైకిల్ ప్రయాణం చాలా క్రొత్తగా, థ్రిల్లింగ్‌గా వుంది. కాకపోతే పాపం మా శివ కష్టపడిపోయాడు."

"నిజమే ....." అని నాతో ఏకీభవించి –

"అన్నయ్య ఏరీ" అన్నాడు చుట్టూ చూస్తూ.

ఎప్పుడు చూసాడో మా ఇద్దరినీ ! ఆనందంగా, వేగంగా వచ్చాడు శివ.

"మీరూ దిగేసారా ? ఇక రా కారుణ్యా వెళ్దాం" నిస్పృహగా చూసాను.

"అప్పుడేనా ?"

"ఇంకా ఎంతసేపు! అసలేముందని ఇక్కడ ? మీ వదినా, పాపా ఒంటరిగా క్వార్టర్సులో వున్నారు కూడానూ."

నా కళ్ళల్లోకి నిశితంగా క్షణం చూసాడు మాధవ్. నా నిరాశ అతనికి అర్థమయిపోయినట్లుంది.

"ఉండనివ్వండి పాపం. వారికి ఇంకా సేపు వుండాలని వున్నట్టుంది. మా డ్రైవర్‌ని సైకిల్ తీసుకెళ్ళి క్వార్టర్సులో సువర్చలగారికి తోడుగా వుండమని చెప్తాను. మనం నిదానంగా కారులో వెళ్దాం."

మాధవ్ వైపు కృతజ్ఞతగా చూసాను. నా కోరికను కాదనలేక, ఆ అపరిచిత యువకుని అభ్యర్థనను తోసేయలేక అయిష్టంగా మా దగ్గరే కూలబడ్డాడు శివా.

నేను నిద్రపోయాననుకుని అంటోంది వదిన 'మన కారుణ్యకు అతని స్నేహం ఏవిటి ?' అన్న వదిన నోటిమీద చెయ్యి వుంచినట్టున్నాడు. మరలా శబ్దంలేదు నేను నిట్టూర్చాను 'అభిరుచులు కలిసిన స్నేహంలో కూడా ఆడ, మగ తారతమ్యాలా ?'

# 4

"అన్నయ్యా ! ఒంటిగంటయింది లే."

"అప్పుడే !" అంటూ కళ్ళు నులుముకుంటూ నా వైపు చూసాడు.

"నువ్వు నిద్ర పోలేదూ ?"

నేను నిద్రపోవాలని ప్రయత్నించానుగానీ నిద్ర రాలేదు. నిన్న ఎవరో అన్నారు 'అదేమిటీ బుర్రా గుహలు చూడకుండా వెళ్ళిపోతారా?' అని. అరకునుండి మా తిరుగుప్రయాణం మర్నాడే అంటే మధ్యలో ఒక్క రోజే మాకు గడువుంది. రేపు బొకారా ఎక్స్‌ప్రెస్‌కి టిక్కెట్లు విశాఖలో బుక్‌చేసేసున్నాయి. పైగా నా పేషంట్సుకు, అన్న క్లయింట్స్‌కు ఫలానా రోజు రమ్మని తేదీ నిర్ణయించేసాము. రేపిక్కడనుండి కదలక తప్పదు.

ఈరోజు ఈ రైలు మిస్ అయితే, బుర్జాగుహలు చూడగలిగే ద్వారాలన్నీ మూతపడ్డట్టే. మరే ప్రయాణ సౌకర్యమూ దానికి లేదు. రైలు తప్పిపోతామేమో అనే భయంలో, ఆ కలవరంలో నేను అర్ధరాత్రి వరకు ఇంచుమించుగా ప్రతి ఐదు నిముషాలకు లేస్తూనే వున్నాను.

"నీకు మానసిక శక్తిలేదు, శారీరకశక్తీ లేదు. అన్నీ చూడాలని ఆత్రం మటుకు జాస్తి" స్వెట్టరు, చేతికిగ్లౌస్, కాళ్ళకి సాక్స్ వేసుకుని తలకి మంకీ క్యాప్ పెట్టుకుని చుట్టూ గ్లాసులు బిగించిన ఆ రూములో రూమ్ హీటర్ పెట్టుకునికూడా వణుకుతున్న నన్నుచూసి ప్రేమగా విసుక్కున్నాడు శివ.

"లే.... లే...." అంటూ అందరినీ లేపేసి అప్పటికే ఇమ్మర్షన్ కాయిల్ పెట్టి నేను కాచిన నీళ్లు అందరికీ సప్లై చేసాను.

"మూడు కిలోమీటర్లు, ఈ చీకటిలో ఈ చేతిలో పాపాయ్‌నేసుకుని నడవాలా ?" విసుక్కుంటూనే తయారయింది వదిన.

మా వదిన భయపడ్డట్టు పాపాయ్ మాకేమీ ట్రబుల్ ఇవ్వలేదు. లేపగానే లేచేసి ఉత్సాహంగా నాతోపాటు తయారయిపోయింది.

గబగబా నేను తయారయిపోయి, కెమెరా, టేప్‌రికార్డర్, టవలు, టాయిలెట్‌సామాను, సబ్బు గట్రా చిన్నబ్యాగ్‌లో సర్దాను. రగ్గులు తలా ఒకటి ఇవ్వబోయాను.

"అవెవరు మోస్తారు. అలా పడెయ్" అంది వదిన. అలా అన్న వదిన, హీటర్ ఆఫ్ చేసి, రూము బయటకొచ్చాక, 'కారుణ్యా! ఒక రగ్గు ఇలా ఇస్తావూ ?' అనకుండా వుండలేకపోయింది. అంత చలిగా వుంది బయట. కడుపులోనుండి, వెన్నులోనుండి వణుకు పుట్టుకొస్తోంది.

తమాషా ఏమంటే, ఆ చీకటి, మంచు కలిసాయి. కన్ను పొడుచు

కున్నా దారి కనబడడంలేదు. అగ్గిపుల్ల వెలిగించాడు అన్న. కొద్దిసేపటికి మా కళ్ళకి అడ్జస్టింగ్ పవర్ వచ్చింది. ఆ పరిసరాలకు మా కళ్ళు అక్లిమటైజ్ అయ్యాయన్నమాట. అడుగులో అడుగువేసుకుంటూ నడవసాగాం.

టేప్‌రికార్డర్ ఆన్ చేసాడన్న —

"అది ఆపేయండి. మనం ఈ చీకటిలో నడిచిపోతున్నామని దొంగలకీ, అడవి మృగాలకూ తెలియాలా ?" అని విసుక్కుంది వదిన. వదినకు అన్నీ భయాలే. టక్కున టేప్ ఆఫ్‌చేశాడు శివ.

అలా మేము నలుగురమే దారి తెలియకుండా అడుగులో అడుగు వేసుకుంటూ, అలా మూడు కిలోమీటర్లు నిశ్శబ్దంగా నడిచిపోవడం ఒక ప్రక్క కాళ్ళు పీకుతున్నా చాలా హాయిగా, అపురూపంగా, పదిలంగా దాచుకోవాల్సిన స్మృతిలా అన్పించింది.

స్టేషన్‌దగ్గరగా ట్యూబ్‌లైట్లు కన్పించాక గుండెలునిండా గాలి పీల్చుకుంటూ అంది వదిన.

"హమ్మయ్య క్షేమంగా చేరాము"

"ఇంకొస్త దూరం నడవగానే, స్టేషన్ వచ్చేసింది. నా గుండెల్లో దడ. స్టేషన్‌లో పాసింజర్ ట్రైన్ నిల్చొనుంది. కదిలేందుకు సిద్ధంగా కూత వేస్తోంది. ఫ్లాట్‌ఫారం ఇంకా మాకు అరఫర్లాంగు దూరంలో వుంది.

"శివా ! పరుగెట్టు. టిక్కెట్లు తీసుకో" అరిచాను.

అన్నతోపాటు నేనూ, పాపాకూడా చేయి చేయి పట్టుకుని పరుగెత్త సాగాం, వదిన వెనకబడిపోయింది. ఆగి వదిన చేతిలో బ్యాగ్ అందుకున్నాను.

"పరుగెత్తు వదినా, ఈ రైలు తప్పితే ..."

నన్ను నా మాట పూర్తిచేయనీలేదు వదిన. బేలగా నవ్వుతూ నీరసంగా జోక్ విసిరింది.

"ఈ స్టేషన్‌లో వెయిటింగ్ హాలు పెద్దదే. చక్కగా పేకాడుకో వచ్చు."

మొత్తానికి మేము రైల్లోపడ్డ కొద్ది క్షణాల్లో రైలు కదిలిపోయింది. తీరా రైలు కదిలాక మాకు స్పృహ వచ్చింది. 'బుర్రాకేవ్స్ చూపిస్తానన్న పెద్దమనిషి రైలు ఎక్కాడో లేదో ?'

*　　　*　　　*

"లేమ్మా కారుణ్యా ! బొర్రాకేవ్స్ స్టేషన్ వచ్చేసింది"

ఉలిక్కిపడ్డట్టు లేచి కూర్చున్నాను. రాత్రంతా నిద్రలేదేమో, రైలు కుదుపులకు ఎప్పుడు నిద్ర పట్టిందో ఆ బల్లమీదే ఒరిగి నిద్రపోయాను.

"నన్ను లేపకూడదా శివా ! వెధవ నిద్ర ఎంత మిస్సయ్యాను !" రైలు కిటికీగుండా అటూ ఇటూ చూచాను. అంతా చిమ్మచీకటి.

"నువ్వేమీ మిస్ అవలేదు. ఈ కటిక చీకటిలో కన్ను పొడుచు కున్నా ఏమీ కనబడదు...."

"అందుకని మా కవయిత్రిగారు ఇక బాధపడడం మానేసి, కాస్త పాపాయి నెత్తుకుంటే నేను రగ్స్ అవీ సర్దేస్తాను" మా శివా మాటలను అందుకుంది వదిన.

"నే నెత్తుకుంటాలే"

"ఊహుఁ వద్దు. కారుణ్యే ఎత్తుకోవాలి. 'పాపాయినికూడా తీసుకెళ్దాం' అని గొడవపెట్టి తీసుకొచ్చిందిగా కాస్త ఈ థ్రిల్ కూడా అనుభవించ నివ్వండి" నన్ను హేళన పట్టిస్తోంది మా వదిన.

పాపాయిని అన్నయ్య ఎత్తేసుకున్నాడు. నేను సామాను సర్దేసాను. ధనాధన్‌మంటూ రైలు టన్నెల్‌గుండా పోతున్న శబ్దం. దూరాన లైట్లు.

## 5

నలుగురం బొర్రాకేవ్స్ ప్లాట్‌ఫారంమీద వున్నాం. కొత్త ప్రదేశం. అక్కడెవ్వరూ తెలీదు. మా ఉద్దేశ్యం తెల్లారేసరికి బొర్రాకేవ్స్ స్టేషన్‌లో దిగుతామని, ఓ నాలుగ్గంటలు గుహలు చూచుకుని 1-30 గం॥లకి మరలా ఆర్. ఆర్. ఎక్స్‌ప్రెస్ కేచ్‌చేసి అరకువెళ్ళి, మర్నాడు మరలా అరకు నుండి వైజాక్ వెళ్ళాలని. కానీ బొర్రాకేవ్స్ స్టేషన్‌లో మేము దిగేసరికి టైమ్ 4-30. తెల్లవారడానికి ఇంకా ఒకటిన్నర గంట టైమయినా పడ్తుంది. ఆ చీకటిలో, ఆ చలిలో ఎక్కడ తలదాచుకోవాలి ?

అన్నయ్య మెల్లగా కదిలివెళ్ళి ఓ పదినిముషాల తర్వాత వచ్చి, బిక్కు బిక్కుమని చలికి వణుకుతూ నిల్చున్న మమ్మల్ని స్టేషన్‌మాస్టారి రూములోకి తీసుకెళ్ళాడు.

"మీరు కొద్దిసేపు ఇక్కడ పడుకోండి. మరో అరగంటలో ఒక గూడ్సు రావాలి. అది చూచుకుని ఇంటికెళ్దాము" అన్నాడు అసిస్టెంట్ స్టేషన్ మాస్టారుగారు.

హఠాత్తుగా అందిన ఈ ఆతిధ్యానికి విస్తుపోయి నిల్చున్న మాతో మరలా అన్నారాయన "పోనీ పిల్లాడిని తోడిస్తాను. మీరెళ్ళండి" తాళాలివ్వ బోయారాయన.

అన్నయ్య వారింపుగా అన్నాడు "థాంక్స్ మాస్టారూ. అందరం కలిసే వెళ్దాము"

ఆ లాంతరు వెల్తురులో చుట్టూ చూసాను. ఆ రూము చాలా చిన్నది. అందులో ఒక టేబుల్, దానిచుట్టూ మూడు స్టూల్స్, మరోమూల సన్నటి పొడవుబల్ల.

ఓ రగ్గు క్రిందపరచి పాపను దానిమీద పడుకోబెట్టి, అదే రగ్గును ఓ పక్కనుండి తీసి కప్పి పొడవు బల్లమీద తాను పడుకుని, మరో ఐదు నిముషాల్లో నిద్రపోయింది వదిన. అన్న, నేను స్టూల్స్‌మీద కాలక్షేపం చేసాము. కొద్దిసేపయ్యాక శివాకు కూడా నిద్రొచ్చినట్టుంది. పాప రగ్గు పరచి దానిమీద ముడుచుకుని పడుకున్నాడు.

అలా ముడుచుకుని పడుకున్న అన్నను చూస్తే నాకు చాలా జాలేసింది.

'పాపం ! నా కొరకు, నా కోరిక తీర్చడానికి ఎన్ని అవస్థలు పడ్తున్నాడు !' నేను ముసుగేసుకున్న రగ్గుతీసి శివామీద కప్పి లేచి నిల బడ్డాను.

రగ్గు తీయగానే చలనిపించింది. కానీ ఆ చలిని తట్టుకోవడానికి ప్రయత్నించి కాసేపటికి గెలిచాను. మరో అరగంట తర్వాత కొద్దివెలుగు దిగంతాల నాక్రమించింది. ఆ వెలుగులో సర్వప్రకృతీ భువనమోహనంగా అతి రమణీయంగా వుంది. లేచాను. పాపాయ్‌ది చిన్న షాల్ వుంటే దాన్ని భుజాలచుట్టూ కప్పుకున్నాను. స్టేషన్ దాటి రైలు పట్టాలమీదుగా నడుచు కుంటూ వెళ్ళిపోయాను.

"ఏమి అద్భుతమైన అందాలు !"

చుట్టూ ఆకాశాన్నంటే కొండలు. వాటి మధ్యగా భయంకరమైన లోయ. ఆ లోయకు కొండలకి మధ్యలో రైలుపట్టాలమీద ఒంటరిగా నేను.

"ఓహ్ ! ఏమందమైన అనుభూతి !"

ఆ మసక వెల్తురులో, నా ప్రియ ప్రకృతి నన్ను పూర్తిగా తన లోకి లాక్కుంటోంది. నా కాళ్ళక్రింద ఏటవాలుగా ప్రయాణించి లోయలో లీనమవుతున్న కొండ రంగురంగుల పూలతో పచ్చటి చీర కట్టుకుంది. క్రింది లోయలోని అందాలు నన్ను రమ్మని ఆహ్వానిస్తున్నాయి. కానీ దారి లేదు. నిరాశగా నిట్టూర్చాను. మరలా నన్ను నేను ఓదార్చుకుంటూ తలెత్తి ఎదురుగా చూచాను ఆ కాశాన్నంటే కొండ, దాని పాదాల మోల రైలు పట్టాలమీద నేను. నా క్రింద లోయ, ఆ లోయలో నడుచుకుంటూపెత్తే – ఏమి ఎదురవుతుందో ! ఆలోయలో అసలు మనుష్య సంచారం అంటూ వుంటుందా ?

నా ప్రక్కగా ఏదో పారిపోయినట్టయి, ఉలిక్కిపడి అది వెళ్ళిన దిక్కుగా చూచాను. చిన్న అందమైన ఉడుత.

* * *

అలా ఆ ఉదయాచలంమీద మెరిసిపోతున్న ప్రకృతిలో పూర్తిగా లీనమై ఆ రైలు పట్టాలమీద నడుచుకుంటూ వెళ్ళిపోతున్నాను. దగ్గరలో టన్నల్ ఏమైనా వస్తుందేమోనని చూస్తున్నాను. కానీ నా ఎదురుగా వున్న కొండ చాలాదూరంలో వుంది. నాకు ఒక్క మనిషికూడా ఎదురవలేదు. దాన్నిబట్టి బొఝాకేవ్ ఊరు చాలా చిన్నదయ్యుండాలి.

ఇంకా నడుస్తూనే వున్నాను. నాకు కుడివైపున్న కొండమీద ఎఱ్ఱటి కాంతి - ఎవరో కొన్ని కోట్ల బల్బులతో ఫోకస్ చేసినట్టుగా - కొండ పైభాగాన్ని ఆక్రమించుకుంది. అటూ ఇటూ తలత్రిప్పి చూసాను. ఎక్కడో సూర్యోదయం అవుతోంది! అసలు తూర్పు దిక్కు ఎటు ? ఆలోచిస్తు న్నాను. నాకు ప్రక్కగా దూరాన కొండమీద రైలు, పిల్లలాడుకునేపాములా సరసర పాకి వస్తోంది. అది కనుమరుగయ్యేదాకా చూసాను. మరళా

నడవడం మొదలెట్టాను. ఆ రాళ్ళమీద నడవడం కొద్దిగా కష్టంగానే వుంది అయినా నా ప్రియ సౌందర్యాలు నన్నక్కడనుండి కదలనివ్వడంలేదు – కొద్దిగా ఎండ నా మీదుగా పడింది - చలికాస్త తగ్గింది. నేను కప్పుకున్న షాల్ తీసేసాను – అంతవరకు ముడుచుకుని నడుస్తున్న నేను కుచ్చిళ్లు వదిలేసి ఫ్రీగా గెంతడం మొదలెట్టాను. నన్ను కంట్రోల్ చేయడానికి అన్నయ్య కూడా లేడు. ఈ ఒంటరితనం చాలా హాయిగా వుంది నాకు.

లోయలోకి తొంగిచూస్తూ నడుస్తున్న నేను అడ్డచెక్కలకున్న చీల నా చీర అంచును పట్టుకున్న సంగతి గుర్తించలేదు. తూలిపడ్డాను. నాకయితే కొద్దిగా అరచేతులు గీరుకుందంతేగానీ చీర అంచు చాలా భాగం చిరిగిపోయింది. నేను చీరను విడిపించుకునేంతలో వెనగ్గా ధనాధన్ అని శబ్దం చేసుకుంటూ, నేనిందాక గమనించిన రైలు కాబోలు వస్తోంది.

చప్పున ప్రక్కకు దుమికేసి అప్పుడు వెనక్కు తిరిగి చూసాను. అదింకా చాలాదూరంలో వుంది. నా ప్రాణభయానికి నవ్వుకున్నాను. కొద్ది సేపటికి నన్ను అమితంగా ఆకర్షిస్తూ మేంగనీసు మోసుకొస్తున్న రైలు వెళ్ళిపోయింది.

అప్పుడు స్పృహలోకొచ్చాను నేను. అన్నయ్యవాళ్ళు లేచుంటారు- అమ్మో! నాకోసం పాపం గాలిస్తుంటాడు. వెనక్కు తిరిగి కుచ్చిళ్ళు ఎత్తిపట్టుకుని మరలా పట్టాలమీద ఇంచు మించు పరుగెట్ట సాగాను.

తీరా స్టేషన్‌లో- ఒక్కరూ లేరు మేము తెచ్చుకున్న సామానూ లేదు. గుండె ఝల్లుమంది ఇది కలకాదు! చుట్టూ చూసాను.

స్టేషన్‌లో నేను రాత్రి ఆ చీకటిలో చూసిందే ఆ ప్రదేశం. నా ఊహకు నాకు నవ్వొచ్చింది. అలా నిల్చుని నవ్వుకుంటున్న నా తలమీద మొట్టికాయ పడింది.

"ఎక్కడికి కెళ్ళావ్ ?"

నేను జవాబు చెప్పలేదు.

"వదినా వాళ్ళేరీ ?"

"వదిన క్షేమంగా వుందిగాని ఒంటరిగా ఎక్కడికి కెళ్ళావ్ షికారు?"

"అలా పట్టాలమీద కొద్దిదూరం . . ." నసిగాను.

"అప్పుడేం ఏం మునిగిపోయింది ? ఎండబడ్డాక అందరం కలిసే వెళ్ళేవాళ్ళంగా."

నేను మాట్లాడలేదు. మా అన్నయ్యకు చాలా కోపం వచ్చేసి నట్టుంది.

"అరే. పరాయి ప్రదేశం. ఎలుగ్గొడ్లు తిరుగుతుంటాయట. ఎంత హడలిపోయాననీ ! గుహల్లోకి వెళ్ళిపోయావేమోనని గుహలదాకా వెళ్ళి వస్తున్నాను."

అలా అన్నయ్య నా కొఱకు మరో దిక్కు వెళ్ళి శ్రమపడి వచ్చి నందుకు సాక్ష్యంగా అంత చలిలో కూడా అక్కడక్కడ ముత్యాల్లా అతని నుదుటిమీద చెమటబిందువులు. కొద్దిగా ఆయాసపడ్తున్నాడు శివా — కోపం తోనూ, అలసటతోనూ.

అలా నా కొఱకు, నా క్షేమంకొఱకు ఆరాటపడ్తున్న అన్నయ్య ఆపేక్షకు నాకు ఆనందం కలిగినా, నేను రెండు గంటలుగా అనుభవించి, అపూర్వంగా పదిలపరచుకున్న ఆనందాన్ని అతని అనవసరమైన భయాలతో తుడిపేస్తున్నందుకు అన్నమీద కాస్త కోపమొచ్చింది.

"పద పద. నన్నే ఎలుగుబంటీ ఎత్తుకుపోలేదుగా. నీకు సంతోష మేగా."

నా నిష్ఠూరంలోని ఆగ్రహాన్ని అర్థం చేసుకున్నాడు. "అది కాదు కారుణ్యా ! పరాయిప్రదేశం....ఒంటరిగా ఆడపిల్లవి ..."

"ఓ. కే. ఓ. కే. ఒప్పుకున్నానుగా. పద పద" నాకు చాలా చిరాగ్గా, బాధగా కూడా వుంది—

'ఈ మగవాళ్ళకి తమ జాతిమీదే ఎంత అపనమ్మకం ! .... ఒక ఒంటరి ఆడపిల్లకు మన సమాజంలో—అది అమలాపురంగానీ, అరకు గానీ – క్షేమంలేదని చెప్పటానికి సిగ్గువేయడంలేదూ వీళ్ళకి !'

* * *

చిత్రం ! మేం వెళ్ళేసరికి, మా కొలకు అతిధి మర్యాదలు ఆహ్వానిస్తున్నాయి. పొగలు కక్కుతూ ఉప్మా, ఫ్లాస్కునిండా కాఫీ.

"ఎక్కడ దొరికిందేమిటి కవయిత్రి ?" వదిన నా వైపు చిలిపిగా చూస్తూ నవ్వుతోంది.

"నేనెక్కడో దగ్గర దొరికానుగానీ, ప్రొద్దున్నే నీ కిష్టమైన పని ఇన్నాళ్ళకు దొరికినట్లుందే" అని ఎదురు జోక్ విసిరాను. మా వదినకు ప్రొద్దున్నే లేచి, రోజుకోరకంగా రకరకాల ఫలహారాలు చేయడం ఇష్టం. కాలేజీ లెక్చరర్ జాబ్‌కి సెలవు దొరికిన రోజయితే, టిఫిన్ల సెక్షన్‌లో నాలుగైదు రకాలు ప్రయోగాలు కూడా చేస్తుంది.

"నేను చేయలేదమ్మాయి. పాపం ఎ. యస్. యమ్.గారే చేయి కాల్చుకున్నారు."

"అయ్యో !" క్షణంసేపు నొచ్చుకుని, "ఆయనేరీ ?" అన్నాను.

"ప్రొద్దున్నే లేపుకుని మమ్మల్నిక్కడ వదిలేసి ఆ ఉప్మా గెలికేసి ఆయన హడావిడిగా వెళ్ళారు పాపం. ఎవరో ఫ్రెండ్ వచ్చారట నిన్న ఇంత ప్రొద్దున్నే ఎక్కడ కెళ్ళారా అంటూ వెతుక్కుంటూ వెళ్ళాడు."

నాకు చాలా ఆశ్చర్యంగా, అపూర్వంగా కూడా అనిపించింది ఆ సంఘటన. ఎవరమో పరాయి వ్యక్తులకు మేము చెప్పుకున్నది నిజమో! అబద్ధమో! అలాటి అపరిచిత అతిధుల కొఱకు ఫలహారాలు సిద్ధం చేయడం—పైగా వాళ్ళమీద పూర్తి నమ్మకముంచి ఇంటిని వాళ్ళ పరంచేసి ఆయన నిశ్చింతగా వెళ్ళిపోవడం—మనుషులమీద ఇంకా నమ్మకం పోని అతను ఎంత అదృష్టవంతుడు!

"పొయ్యిమీద వేన్నీళ్ళున్నాయి. అమ్మగారు అలసిపోయారు ముఖం కడుక్కోవచ్చు."

"నిజమే! ముఖం కడుక్కుంటే హాయిగా వుంటుంది. కునికిపాట్లు పడ్తున్న పాపాయ్‌ని లేపేసాను, టైమ్ వేస్ట్ చేయకుండా పాపాయ్‌కి ముఖం కడిగేసి, నేనూ కడుక్కుని క్షణంలో తయారయిపోయాము. పాపను తీసు కుని బయటకు వెళ్ళబోతున్న నన్ను ఆపేసింది వదిన.

"ఆగాగు. టిఫిన్ తినిపోదువుగాని"

ఆగిపోయాను. నాకు ఆకలిగానే వుంది. టిఫిన్ తినేసి బయటకొచ్చి నిల్చున్నాను. ఆ ఎ. ఎస్. యమ్ గారి కిచ్చిన క్వార్టర్స్ చిన్నదే. ఒక సిట్టింగ్ రూము, ఆ ప్రక్కనే బెడ్‌రూమ్ కమ్ స్టోర్ రూమ్. డైనింగ్ హాలనబడే వరండా. అంతే—శ్రీమతి పుట్టింటికి వెళ్ళిందట. ఇల్లు చాలా అస్తవ్యస్తంగా వుంది. అయితే ఏం? నాకు ఇంతవరకు కనబడని ఇంటి యజమాని చాలా నచ్చాడు. ఇంటిముంగిట దానిమ్మ చెట్లు, పొదలావున్న రోజాచెట్టు. కాంపౌండ్ వాల్‌దాటి నాలుగు మెట్లెక్కి ఎడమవైపు చూచాను. బాలవాడి — అందులో ఇనుప ఛెయిన్‌కు వేలాడుతున్న చెక్క ఉయ్యాల నా కెంతిష్టమో! ఉయ్యాల ఊగడమంటే. ఇంతవరకు తీరని కోరిక అది!

"పాపాయ్ ! ఉయ్యాల ఊగుదామా ?"

తల విసురుగా తిప్పింది పాప అంగీకారసూచకంగా.

## 6

ఉయ్యాలలో విసురుగా ఊగుతున్న నాకు అల్లంతదూరాన పరిచయ మయిన ముఖం కన్పించింది. ఉయ్యాల స్పీడు తగ్గించి నిశితంగా చూసాను. మాధవ్‌గారు—

"అరె ఇతనిక్కడ కెలా వచ్చాడు ?" అన్న ప్రశ్న వెనగ్గా, అతని తోడు ఈ అందమైన బొజ్జాకేవ్స్‌లో కూడా దొరకబోతున్నందుకు నా మనసు గెంతులేసింది.

అతను అదే చిరునవ్వుతో నా దగ్గరగా వచ్చాడు. ఉయ్యాల ఆపి నిల్చున్నాను.

"కూర్చోండి. హాయిగా ఊగండి. మరిలా మన గూటికి చేరితే ఇలాటి అనుభవాలకి ముఖం వాచిపోత్తాం."

నేను నవ్వేసి "మీరు బొజ్జాకేవ్స్‌కి వస్తున్నట్టు నాకు చెప్పనేలేదు" అని నిష్ఠూరమాడాను.

అతని పెదవులమీద చిరునవ్వు ఇంకా మాయం కాలేదు. "నేను మీకు చెప్పాను కారుణ్యగారూ ! మీరు మర్చిపోయారు"

నిజమే అరకులో విడిపోతూ అతనన్నాడు, గుర్తొస్తోంది. 'ప్రక్క స్టేషన్‌లో నా స్నేహితుడు ఎ. యస్. యమ్. గా వుంటున్నాడు. వాడిని చూచి, ఒకరోజు గడిపి వెళ్తాను' అని. 'అతను వెళ్ళిపోతున్నాడే' అనే బాధలో ఆ మాటలు ఆ రోజు అక్కడి క్వార్టర్సు ముందు రేకులు వేసిన

ముందువాలో నిలబడ్డ నా మనసును తాకలేదు. ఆ తర్వాత మేము ప్రక్కగా వున్న కొండ ఎక్కి వచ్చేసరికి అతను మరెటో వెళ్ళాడు. ఆ తర్వాత అతను కలుసుకోవడం ఇదే.

"కానీ మీరు బొర్రాకేవ్స్ ఇంత అందంగా ఉంటుందని చెప్పలేదు"

ఇంకా అతని చిరునవ్వు మాయం కాలేదు.

"నాకూ తెలీదు. వీడూ ఎప్పుడూ వ్రాయలేదు. నాలుగేళ్ళుగా నన్ను రమ్మని వ్రాస్తున్నాడేగానీ, ఇక్కడ ఇన్ని అందాలు కుప్పలుగా వున్నాయని వ్రాసుంటే ఎప్పుడో వచ్చేసుండేవాడిని.

అప్పుడు పరీక్షగా చూసాను ప్రక్కన అతను మాకు ఆతిధ్యమిచ్చిన ఎ. యస్. యమ్. నా మనసులో దైవత్వాన్ని నింపుకుని అపురూపంగా నిలిచిపోయిన అసిస్టెంట్ స్టేషన్ మాస్టారు.

అప్పుడే గుర్తించినట్టు నమస్కారం పెట్టాను. అతను తిరిగి చేతులు జోడుస్తూ అన్నాడు.

"వీడి పిచ్చిగానీ, ఏముందండీ ఇక్కడంతా ఉత్త అడవి"

నేను చప్పున మాధవ్ కళ్ళల్లోకి చూసాను. అవి నా మీదుగా ప్రకృతిలోకి తొంగిచూస్తున్నాడు.

"నిన్ననగా వచ్చాడు. క్షణంసేపయినా నాతో గడపలేదు" నవ్వుతూ నిష్ఠూరమాడాడు ఎ. యస్. యమ్. ఆయన పేరు నాకు తెలీదు."

"కేవ్స్ చూసేసారా ?" ఆతృతగా అడిగాను.

"లేదండీ ఈ రోజు చూడాలి."

"అయితే వెళ్దామా ?"

"మీ అన్నయ్యావాళ్ళు ఎక్కడున్నారు ?"

"మీ స్నేహితునికి మేము అతిథులం" అనేసి అతనికి నా కృతజ్ఞతలు తెల్పుకోవాలనే స్పృహవచ్చి,

"మా కొరకు మీరు చాలా శ్రమపడ్డారండీ"అన్నాను ఎ.ఎస్.ఎమ్.తో

"ఇందులో శ్రమ ఏముంది ?" అని ఇబ్బందిగా నవ్వేసి,

"లోపలికెళ్ళి టిఫిన్ తినిరా మాధవా కేవ్స్‌కెళ్దురుగానీ" అన్నాడు.

"నువ్వు రావూ ?"

"ఉహుఁ నాకు కొస్త వర్క్ వుంది. గైడ్‌నిస్తాను మీరు వెళ్ళేసి రండి."

"కేవ్స్ ఇక్కడికెంత దూరం వుంటాయండీ" అడిగాను.

"ఎంతో దూరం వుండవమ్మా. ఓ కిలోమీటరుండొచ్చు."

"అయితే వాహనాలతో పనిలేదు" అని నవ్వేసి.

"మీ కారేదీ ?" అన్నాను.

"కారు అరకులో వుంది."

"అదేం ?"

"బొర్రాకు కారురూట్ లేదు. డ్రయివర్‌తో. కారు విశాఖ వెళ్ళిపోయుంటుంది. పైగా తిరుగుప్రయాణం రైల్లోనే చేయాలనుకున్నాను ఈ కొద్ది దూరానికే ఈ చీకటిలోనే అరకునుండి బొర్రా ప్రయాణం చాలా థ్రిల్లింగ్‌గా వుంది."

నాకు ఉత్సాహం వచ్చేసింది. రైలు ప్రయాణంలోని అనుభూతుల్ని ఏకరువు పెట్టసాగాను. నా మాటలు మాధవ్‌గారికయితే నచ్చాయిగానీ, ఎ.యస్.యమ్. గార్కి కొద్దిగా విసుగనిపించినట్లుంది.

"నిజమే నిజమే ట్రెయిన్ జర్నీ చాలాబాగుంటుంది. రారా మాధవా టిఫిన్ తిందువుగానీ" అని నా వాక్ప్రవాహానికి ఆనకట్ట వేసేసారు.

వాళ్ళు అటు వెళ్ళగానే మరలా ఉయ్యాల ఎక్కేసాం నేనూ పాపాయ్. ఈసారి మా ఇద్దరినీ చూడడానికి పిల్లలు గుమికూడారు.

"క్రాస్త మా ఉయ్యాల ఊపుతారా?" మొహమాటం లేకుండా అడిగేసాను. వాళ్ళకి అది చాలా ఇష్టమయిన సంగతి అన్పించేలా నా కాళ్ళల్లో వణుకు పుట్టేంత విసురుగా ఊపసాగారు పిల్లలు. నేనలా ఇంకా ఉయ్యాల ఊగుతుండగానే వదిన, శివ, మాధవ్ వచ్చారు

"అదేమిటి కారుణ్యా ! కొత్తచీర ! అలా ఎందుకు చిరిగిపోయిందసలు ?" అంటూ గబగబా దగ్గరకొచ్చి చిరిగిపోయిన అంచు పట్టుకుంది.

నిజమే వస్తూ వస్తూ మనసుపడి కొనుక్కొచ్చుకున్న చిగురాకు పచ్చ చిన్న డిజైనున్న ఆర్గండీచీర - ఒక గజం మేర అంచు సన్నగా చీలిపోయింది.

అప్పుడు నా అరచేతివంక చూచుకున్నాను. కొద్దిగా బాధగా అన్పించింది గాయం.

"దెబ్బ తగిలిందా ?" అన్నాడు అన్నయ్య.

నేను లేదంటూ గబుక్కున అరచెయ్యి ముడి చేసుకున్నాను. లేకపోతే నాకు తెలుసు తీరా తెల్లవారకముందే మా అన్నభాషలో ఊరిమీద పడ్డందుకు మరలా నాకు అక్షింతలు తప్పవు.

"ఉండండి మా వాడినడిగి సూది దారం తెస్తాను లేకపోతే నడవటం కష్టం" అంటూ నేను అభ్యంతరం తెలిపేలోపలే మాధవ్ లోపలికెళ్ళాడు వదిన నేను చీర చించేసుకున్నందుకు, నేను ఉయ్యాలమీద కుదురుగా కూర్చోనందుకు కోప్పడుతూ నా చీర పాపం కుట్టిపెట్టేసింది. పాపాయ్ మా వదినకు సాయం చేసింది.

అక్కడనుండి అందరం బయలుదేరి పచ్చటి, ఒత్తైన గడ్డితో

మునిగిపోయున్న గుట్ట ఎక్కి రోడ్డు అనబడే రైలుపట్టాలెక్కాం. ఆ ఊర్లో నేను రోడ్డు చూడనేలేదు. అలా ఆ పచ్చని పచ్చికను చూస్తుంటే ....

కొంతదూరం అలా నడిచాక కాస్త ఎత్తు ఎక్కిన మేము రైలుపట్టాలకు దూరమైపోయాము. పట్టాలు కుడివైపుగా చీలిపోయాయి. సన్నటి కాలిబాటకిరువైపులా; కాశీరత్నాలు, అడవిపూలు. ఒక్క అడవిపువ్వు తుంచి దానివైపే పరీక్షగాచూస్తూ నడుస్తున్నాను. అవి గుత్తులు గుత్తులుగా, ఎరుపు, పసుపు కలిపి చాలా అందంగా వున్నాయి. ఒక్కో రెమ్మే విడిగాచూస్తే అది మరో పువ్వులా కన్పిస్తుంది. అలా చూస్తున్న నాకు దూరాన రైలు శబ్దం విన్పించింది.

"డాక్టర్ ఆంటీ రైలు, రైలు" అమ్మ చెయ్యి వదిలేసి సంబరంగా నా వైపుగా పరుగెట్టుకొచ్చింది పాపాయ్. నేను వెనక్కి మళ్ళాను. నాకెదురొస్తున్నారు శివ, వదిన, మాధవ్ వాళ్ళనికూడా లాక్కొని కొండ వెనక్కి వెళ్ళాను. అక్కడనుండి రైలుపట్టాలు మాకంటె పద్దెనిమిది అడుగుల దిగువలో కన్పిస్తున్నాయి. అక్కడ నిలబడి అటూ ఇటూ చూచాను. ఇంకా రైలు కనుచూపుమేర రాలేదు.

"ఒక్కో రెక్క ఒక్కో పున్నాగ పువ్వులా ఉంది కదండీ" నా చేతిలో అడవి పువ్వువైపు చూస్తూ అన్నాడు మాధవ్.

అవునన్నట్టు తలూపి - ఆ పువ్వు అతని చేతికందించాను. అవి ఎంత స్వల్పమైనవైనా; సరే నాతో ఎవరైనా హృదయపూర్వకంగా ఏకీభవించారంటే నాకు చాలా తృప్తిగా వుంటుంది.

## 7

"కేవ్‌లో ప్రవేశించాము. నేను ఎంతో ఊహించుకున్న ఆ గుహ - నేనూహించాల్సింది ఇంకా మిగిలిపోయిందన్నట్టు అద్భుతంగా వుంది.

'బొర్రాకేవ్స్' అంటే ఒక ప్రదేశంలో చిన్న చిన్న గుహలు చాలా వుంటాయనుకున్నాను. కానీ భయంకరమైన పెద్ద గుహ అది – కాగడా వెలుతురులో గైడ్ కుర్రాడి వెనుక నడుస్తున్నాము. ఒక్కసారిగా ఎగిరిన గబ్బిలాయిల గుంపుతాలూకు గాలితాకిడికి కాగడా ఆరిపోయింది, అంతా చిమ్మచీకటి. చీకటి ప్రియురాలినైన నాలోనే ఏదో భయం. అరక్షణం తర్వాత అదో థ్రిల్ ప్రక్కనే వున్న వదిన చెయ్యి పట్టుకున్నాను.

"ఎంత బాగుంది వదినా ?"

"గుండెలదిరిపోతుంటే నీకు బాగుందా ?" విసుగ్గా అంది వదిన.

"కాగడా వెలిగిస్తున్నారులెండి, కిరసనాయిల్ అయిపోయినట్టుంది" మరో ప్రక్కనుండి మాధవ్ గొంతు.

"మరలా సన్నటికాంతి. ఆ కాంతిలో అందరికీ కొంత ధైర్యం వచ్చింది కొంత ముందుకెళ్లాం.'

"ఛీ. ఛీ నీళ్ళు" చీర కుచ్చిళ్ళు ఎత్తిపట్టుకుంటూ మరలా విసుక్కుంది వదిన.

"సీపేజ్ వాటర్...." అన్నాడు అన్న.

నా కాళ్ళక్రింద, చాలాక్రింద జలజల పారుతున్న శబ్దం.

"ఆ శబ్దం ఏమిటీ ?" అడిగాను.

"క్రింద జలపాతం వుందికదండీ" అన్నాడు పొట్టి నిక్కరు ఒక చేత్తో సర్దుకుంటూ గైడబ్బాయి.

"క్రింద జలపాతమా ?" అవధులులేని ఆనందం నన్ను చుట్టేసింది. ఇంకొంత నడిచాక గుహలో ఓ చిన్న కొండ, దానిమీదకు మెట్లు,

ఆపైన మరో గుహలో గడ్డాలు పెంచుకున్న ఓ వ్యక్తి ఓ మునీశ్వరుడు. అతని ప్రక్కన అతని శిష్యుడు... సినిమాల్లో చూడ్డమేగానీ మునులు నా కెక్కడా తటస్థ పడలేదు. మా నాన్నగారు నాస్తికులు.

ఇంకా ముందుకు నడిచాం. అక్కడ కుడివైపు తిరగాల్సి వచ్చింది. అక్కడ మరీ ఎక్కువగా కాళ్ళక్రింద నీరు.

"ఇంకా ఎంత దూరం ?" అన్న అడిగాడు, గైడ్ చెప్పాడు.

"అంతా చూస్తారా ?" అన్నవాడికి జవాబు చెప్పకముందే నే నందు కున్నాను.

"ఆఁ అంతా చూడాలి"

"మొత్తం చూడాలంటే రాత్రయిపోద్ది" వాడు కాగడా పట్టుకుని ముందుకు పోతూనే అన్నాడు.

"రాత్రా ?...రాత్రయితే మనకెలా వీలవుతుంది ? బొకోరోకి టిక్కెట్స్ బుక్ చేసున్నాయి కూడా" వదినవైపు తిరుగుతూ అన్నాడు అన్న.

"బొకోరోకా ? ఎలా కేచ్ చేయగలరు ? ఇప్పుడు బయలుదేరితే తప్ప కేచ్ చేయలేరు .... లగేజ్ తెచ్చుకోనుంటే బావుండేది" మాధవ్ అన్నాడు.

"లగేజ్...లగేజ్ తేవాలంటే ఇటునుండి రూట్ లేదన్నారు."

"రూట్ వుంది. ఇటునుండే వెళ్తాను రేపు నేను" మాధవ్ పాపని వదిన దగ్గరనుండి అందుకుంటూ అన్నాడు.

"ఎలా ఇప్పుడు ?!" వదిన నీరసంగా అంది. ఆమెకు ఎప్పుడెప్పు డెళ్ళిపోదామా అని వుంది. ఏదో నా పోరు పడలేక వచ్చింది పాపం.

అన్న క్షణంఆలోచించాడు. టైమ్ చూసుకున్నాడు. "అయితే ఓ పని

చేస్తాను. ఇప్పుడే అరకువేలీకి ఓ పాసెంజర్ వుందన్నారు ఎ.యస్.యమ్. గారు. నేను వెళ్ళి లగేజ్ తీసుకుని వస్తాను. ట్రెయిన్ బొఱ్ఱాకేవ్స్ స్టేషన్ తో ఆగగానే నేను వాకిలి దగ్గర కొస్తాను. మీరు నా బోగీలో ఎక్కేయండి. ఓ. కే."

"మేము మాత్రం ఇక్కడేం చేస్తాం. మేమూ వచ్చేస్తాం. చెల్లా చెదురుగా వుంది లగేజ్ అంతా."

"ఫర్వాలేదులే. ఏదో తొక్కుకుని వస్తాను" అని చాలా కేజ్యుయల్ గా రోజూ చూస్తున్న ప్రదేశాన్ని వదిలి వెళ్తున్నట్టుగా....నాలుగడుగులు వేశాడు. నా కెంత ఆశ్చర్యమో శివాని చూస్తే .. ఏదీ అతన్ని కదిలించదు. అది సంతోషంగానీ, విషాదంగానీ...

వదిన వదిలిపెట్టలేదు. వడివడిగా అన్న దగ్గరకు నడిచింది.

"నా కిక్కడ బోర్ కొడ్తోంది. నేనూ వస్తాను."

'నిజమే. ఏదో భర్తతో సరదాగా తిరగవచ్చని వచ్చిందిగానీ. ఈ చెట్టుపుట్టల కొరకు కాదుగా' నాకు జాలేసింది.

"సరే పోదాం పదండి" అని కదిలానేగానీ నా గుండెలనిండా అసంతృప్తి.

మాధవ్ కూడా మాతో కదిలాడు.

"మీరు చూడండి. మేము వెళ్తాం" వారించాడు శివా.

"ఫర్వాలేదు. మీరు ట్రైన్ ఎక్కాక మరలా వస్తాను. నేను ఇక్కడే వుంటాను కదా !"

మేము హడావిడిగా స్టేషన్ కొచ్చాంగానీ రైలు ఇంకా అరగంట లేటు.

"నేను వెళ్ళి మీ రగ్గులు అవీ తెస్తాను. ఈ లోపల ట్రెయిన్ వస్తే

మీరు వెళ్ళిపోండి. రేపు నేను అందిస్తాను" అనేసి వేగంగా వెళ్ళిపోయాడు మాధవ్ ఎ. ఎస్. యమ్.గారి దగ్గర ఇంటి తాళం తీసుకుని.

"మీకు మా వస్తువులేం తెలుస్తాయి ?" అని అరుస్తున్నా వినిపించుకోకుండా వెళ్ళిన మాధవ్ ఒక్క వస్తువు కూడా మిస్ కాకుండా తెచ్చాడు "థాంక్స్" అందుకుంటూ అంది వదిన.

"ఇంకా లేటు బండి" అన్నతో ఏదో మాట్లాడుతూ ఆగి మాధవ్ వైపు తిరిగి అన్నాడు ఎ. ఎస్. ఎమ్.

"మీతో....మీతో కొద్దిసేపు గడిపే అవకాశం రైల్వేవాళ్ళు మాకిచ్చారన్న మాట" చిరునవ్వుతో చూసాడు మాధవ్.

"ఇప్పుడే వస్తాను" అని ఎ. ఎస్. ఎమ్. తన రూముకెళ్ళి ఫోన్‌లో మాట్లాడి "మరో 15 నిముషాల్లో బండి వచ్చేస్తోంది" అన్నాడు.

వదిన చేతిలో షాల్ తీసుకుని బాగా మడచి స్టేషన్ మాస్టార్‌కిస్తూ అన్నారు శివా. "కొత్తదే ఈ టూర్‌కోసమే కొన్నాను. రాత్రి ట్రెయిన్‌లో వాడానంతే....దీన్ని మీ దగ్గిర వుంచండి మా గుర్తుగా."

'ఇంత మంచి అలోచన ఆ మెషిన్‌లాంటి మనిషికెలా వచ్చిందా ?' అని ఆశ్చర్యపోయాను నేను.

"భలే వారే ! మీ కింకా టూర్ పూర్తికాలేదు. మీకు దీనితో చాలా అవసరం వుంది" ఎ. యస్. యమ్. మరలా తిరిగి ఇవ్వబోతూ అన్నాడు.

"ఉంచండుంచండి మా దగ్గర ఇంకా వున్నాయి" వారిస్తూ అంది వదిన.

"భలేవారండీ మీరూ ? ఈ గుర్తులు జ్ఞాపకాలు—షాల్ లేకపోతే వుండవా ?"

"ప్లీజ్ మీరుంచండి" అని బలవంతంగా అతని చేతిలో షాల్ వుంచి ఋణం తీర్చుకున్నాడు మా అన్న.

రైలు వస్తున్న సూచనగా మొదట గంట కొట్టారు. నా గుండెల్లో ఏదో వేదన, చీకటి, దిగులు.

"ఇంతదూరం వచ్చి తీరా పూర్తిగా గుహలు చూడకుండానే వెళ్తున్నాం" నిరాశగా అన్నాను.

రెండు నిముషాలు మౌనంగా వున్న శివా స్టేషన్‌మాస్టారు చెయ్యి పట్టుకుని అన్నాడు.

"మీరు వచ్చే ట్రెయిన్‌లో మా కారుణ్యను ఎక్కించగలరా? తను ఇంటికి వెళ్ళినా అసంతృప్తి ఫీల్ అవుతూ వుంటుంది. మే మొచ్చేలోపల మాధవ్‌గారు తనకు కేవ్స్ చూపిస్తారు. ఏమంటారు మాధవ్‌గారూ."

"భలేవారే దీంట్లో అనేదాని కేముంది ? ఎలాగూ నేనూ చూడాలి కదా !"

"థాంక్స్ అండీ. ఏం ? కారుణ్యా ఓకేనా ?

ఓ. కె. అన్నట్టు చూసాను.

మా వదిన ముఖం చిట్లించింది. ఏమైనా ఆడదానికున్న ముందు చూపు మగవాళ్ళకుండదు. ఆమెకు నన్ను అలా ఓ పరాయి మగవాళ్ళమీద వదిలి మా అన్న రావటం ఇష్టం వున్నట్టులేదు. దానికి తప్పు పట్టాల్సిన అవసరమూలేదు. నేను మా వదిన భయాన్ని అర్థం చేసుకున్నాను

"వదినా ? నువ్వూ వుండిపోకూడదూ ?"

క్షణం ఆలోచించింది మా వదిన. 'కందకులేని దురద కత్తిపీట కెందుకనుకుంనేమో' "నేను రానుగానీ జాగ్రత్త. మేము రేపు పొద్దున ఏడు గంటలకల్లా ఈ స్టేషన్‌లో వుంటామట. మర్చిపోయి నిద్ర పోకుండా వచ్చెయ్."

అలాగేనన్నట్టు తలూపాను.

తీరా రైలు కదలబోయేముందు మా పాపాయి మరాం చేసింది అత్తతో వుంటానంటూ. నాకు కూడా కొత్త వ్యక్తులమధ్య బెరుగ్గా అన్పించి వెంటనే పాప నందుకున్నాను.

ట్రెయిన్ రావడం, అన్న వదినా అందులో వెళ్ళిపోవడం మరలా పాప ఏడుపు మొదలెట్టి ఆపేయడం అన్నీ అయిపోయేసరికి ఎ.ఎస్.ఎమ్. గారు తన రూములో నుండి మా దగ్గిర కొచ్చి "ఇప్పుడే గుహల్లోకి వెళ్తారా ? కాసేపు రెస్ట్ తీసుకుంటారా ?" అన్నాడు.

"వద్దు. వద్దు. ఇప్పుడే వెళ్దాం" నా జవాబు వింటూనే నాతో కదల బోయాడు మాధవ్.

నేను రిస్ట్‌వాచ్ వంక చూచుకున్నాను. అప్పటికే టైమ్ రెండు ముప్పావు అయింది. అంటే ఇప్పుడెళ్తే ఓ మూడు గంటలసేపు అక్కడ తీరిగ్గా కూర్చోవచ్చు. మరలా ఐదున్నర దాటితే చీకటి పడిపోతుంది.

"అయితే కొద్దిసేపు అలా ఆ కొండమీద ఎండలో కూర్చోండి. ఆ గైడు కుర్రాడిని కాగడా ఇచ్చి పంపుతాను."

నేను ఎ.యస్.యమ్. గారు చూపిన కొండభాగంవైపు చూసాను. పెద్దకొండేమీకాదు. ఓ పద్దెనిమిది అడుగుల ఎత్తుండొచ్చు. అక్కడకెక్కితే ఇంకాస్త ఎత్తునుండి లోయలో అందాలు మరీ స్పష్టంగా చూడొచ్చు. ఎ.యస్.యమ్ గారు మాకలా స్థలం చూపి కదలబోయారు. నేను పాప వేలు పట్టుకుని కొండవైపుగా నడవబోయి ఆగి, వెనక్కు తిరిగాను.

"చూడండి మీరు రాత్రికి శ్రమపడి మా కొరకు ఏమీ తయారు చేయొద్దు. అలా మీరు చేస్తే, నేను చాలా బాధపడాల్సివస్తుంది" అన్నాను ఇంగ్లీషులో కృతజ్ఞతలు, క్షమాపణలు, ఫార్మాలిటీస్‌లాంటివి తెలుగులో తెలియజెయ్యాలంటే కాస్త ఇబ్బందిగా వుంటుంది.

"మీరు ఆకలిని జయించారా ఏమిటండీ" అనిసన్నగా నవ్వుతూ:

"కారుణ్యగారూ మీరు మొహమాటపడాల్సిన పనిలేదు. మావాడు ఎవరికి ఆతిథ్యమిచ్చినా హృదయపూర్వకంగానే ఇస్తాడు." అన్నాడు మాధవ్.

"అయితే .... మీరేమీ ప్రిపేర్ చేయొద్దు. నేను కేవ్స్‌నుండి వచ్చి, మన నలుగురికీ ప్రిపేర్ చేస్తాను."

"మీరలాంటి మొహమాటాలు పెట్టుకోకండి. మీరు హాయిగా, తిరిగ్గా కేవ్స్ చూడండి. ఏదో నాకొచ్చినంత నేను చేసిపెడతాను."

నేను మాట్లాడలేదు. కానీ నాకు చాలా మొహమాటంగా మాత్రం వుంది."

"పోనీలేరా ! ఆమెనెందుకు డెలికేట్ పొజిషన్‌లో పెడతావు ? ఆమె ఇష్టప్రకారమే కానీ...."

"ఓ. కే."

నేను కృతజ్ఞతగా మాధవ్‌వైపు చూసాను.

"మీకు మరలా ఇంటికెళితే వంటచేసే ఛాన్స్ దొరుకుతుందో లేదో !" అని నవ్వాడు మాధవ్.

## 8

ఒక అరగంట తర్వాత గైడ్ పిల్లాడు ఈసారి పెద్ద డబ్బానిండా కిరోసిన్ వేసుకుని కాగడా పట్టుకొచ్చి మాకు పద్దెనిమిది అడుగుల క్రింద నిలబడి మమ్మల్ని కదలమన్నట్టుగా చూసాడు. మా పాపాయికి ఆ కొండ, ఆ చదునైన ప్రదేశం - ఆ గడ్డి చాలా నచ్చింది. ఆ అడవి పూలన్నీకోసి

ఒడినిండా తెచ్చి, రెమ్మలన్నీ తుంచి, హఠాత్తుగా అన్నీ మా ఇద్దరి తలల మీదా కుమ్మరించేసింది.

నేను ఉలిక్కిపడి, తేరుకుని కోపంగా చూసాను పాపాయ్‌వైపు ఏడుపుముఖం పెట్టేసింది పాపాయ్. మాధవ్ పాపని ఒళ్ళోకి తీసుకుంటూ అన్నాడు.

"మనం మన వయస్సుల్లో నిలబడి వాళ్ళు చేసే పనులకు కోప్పడితే ఎలాగండీ ! ఆ వయస్సు ఆ పనులు సహజం. మనమూ ఆ వయస్సులో, ఇలాంటి పనులే చేసుంటాము."

పాపాయ్ మా ఇద్దరిమీదా అలా పూలు పోయడం, నేను దానికి కోప్పడడం, మాధవ్ పాపాయ్ చేసిన ఆ పనిని సమర్థించడం వీటన్నిటికీ తాను అంత ప్రాధాన్యతివ్వడంలేదని ధ్వనించడానికి మాట మార్చాను.

"ఈ పూలెంత అందంగా వున్నాయో ! వీటి పేరేమిటో" అన్నాను నా తలమీదనుండి ఒడిలోకి వాలిన ఓ పువ్వు పట్టుకుని పరిశీలిస్తూ.

అతనూ మరో పువ్వు తీసుకుని, దానిని పరవశంగా చూసి,

'శీతాక్షింతపూలు' అని చెప్పి లేచి నిల్చున్నాడు.

"వెళ్దామా ?"

'నేనూ లేచి నిల్చుని, పాపాయ్‌తో రాజీపడే ఉద్దేశంతో పాపాయ్ చేయి అందుకోబోయాను. విసురుగా తన చెయ్యిలాక్కుంది పాపాయ్.

"నేను అంకుల్‌తోనే వస్తాను."

* * *

"మరి మీరు కాగితాలు తెచ్చుకోలేదే"

కొండ దిగుతూ అడిగాడు. నేనూ అదే ఆలోచిస్తున్నాను. నేను

తెచ్చుకున్న కాగితాలన్నీ అరకులో వుండిపోయాయి. 'బొర్రాకేవ్స్‌లో వ్రాసుకోవడానికేముంటుందిలే' అనే నిర్లక్ష్యభావంతో పెన్ కూడా తెచ్చుకోలేదు.

"ఓ క్షణం మీరలా కూర్చోండి. నేనిప్పుడే వస్తాను" అని పాప చెయ్యి విడిపించుకుని వెళ్ళి ఐదు నిముషాల్లో ఇంతకట్ట తెల్ల కాగితాలు, పేనా, ఒత్తుకు ప్యాడ్, అన్నీ తెచ్చి నాకందించాడు.

అతనలా ఐదునిముషాల్లో, ఆ సరంజామా అంతా తేవడం, నిజానికి చాలా చిన్న విషయమే. కానీ మనుషుల సమర్థత చిన్న చిన్న విషయాల్లో కూడా తెలిసిపోతుంది. నేను కథ వ్రాసుకోవాలనుకున్న సంగతి గ్రహించి, నేను అడక్కుండానే నాక్కావాల్సినవి తెచ్చిపెట్టిన అతనంటే నాకు ఆరాధన కలగడంలో నా మనసుది దోషం కాదు.

"పదండి పోదాం."

"మరలా ప్రొద్దుటిలాగే కేవ్స్‌కి మా ప్రయాణం. ప్రొద్దుటికంటె కూడా థ్రిల్లింగ్‌గా అన్పిస్తోంది నాకు. మా పాపాయ్ అడివికాయల కలెక్షన్‌లో పడిపోయింది. మేమిద్దరం మెల్లగా నడుచుకుంటూ వెళుతున్నాం.

"అరకుకంటే, ఈ ఊర్లో చలి కాస్త ఎక్కువగానే వున్నట్టుంది కదండీ."

"అవును. అరకుకంటే, బొర్రాకేవ్స్ మరికొన్ని అడుగుల ఎత్తులో వుందికదా !"

* * *

అలా నడుచుకుంటూ వచ్చి పాపాయ్‌తో మేమిద్దరం, కేవ్స్‌లో కెంటర్ అయ్యాము.

ఎండలోనుండి వచ్చావేమో, ఎయిర్‌కండిషన్ రూములోకి అడుగు బెట్టినట్లయింది. ఓ పది నిముషాలు ఇద్దరం మౌనంగా ఎవరి లోకంలో వాళ్ళు పడిపోయాం. మెల్లిగా నడుస్తున్నాం. పాపాయ్ గైడ్ కుర్రాడితో స్నేహంకట్టేసింది. వాడేదో చెపుతున్నట్లున్నాడు, మా పాపాయ్ ప్రశ్నలతో వాడిని చంపేస్తోంది.

"మీకు బాగా లోపలికెళ్ళాలనుందా ?" అడిగాడు మాధవ్. వెళ్ళాలని వుందన్నట్లు తలూపాను. గైడ్ కుర్రాడిని పిలిచి, కిరసనాయిలు సరిపోతుందో, లేదో తెలుసుకున్నాడు మాధవ్.

"రండి వెళ్దాం. కానీ పాప భయపడుతుందేమో" అన్నాడు.

"నాకేం భయంలేదు" అని నాకు హామీ ఇచ్చింది పాప. కానీ తీరా బురద దగ్గరకొచ్చేసరికి, 'నేను నడవలేను' అని మొండికేసింది. మాధవ్ పాపాయ్ నెత్తుకున్నాడు. నాకు కాస్త గిల్టీగా అన్పించింది.

"మీకు శ్రమ అయిపోయింది నావల్ల" అన్నాను మనస్ఫూర్తిగానే.

"దీనిని నేను శ్రమ అనుకోవడంలేదు. చెప్పానుగా మీ కంపెనీ నాకు చాలా నచ్చింది" అనేసి ఒక చేతిమీద పాపాయ్ నెత్తుకొని, పడిపోతావని ఒక చేత్తో నా చెయ్యి సున్నితంగా పట్టుకుని, ముందుకడుగేసాడు.

ఆ భయంకరమైన గుహల్లో, ఆ కాటుకచీకటిలో, కాగడా కాంతిలో గబ్బిలాయిల శబ్దాలు, జలపాతపు మధుర ధ్వనులమధ్య నిశ్శబ్దంగా నేనూ, మాధవ్, పాప, గైడ్ కుర్రాడు....

'ఓహ్ ! ఎంత మధురమైన అనుభూతి !"

"అరకువేలీకంటే నాకు బొర్రాకేవ్సే నచ్చాయి .... మరి బొర్రా

కేవ్స్‌కు ఎందుకు ప్రాధాన్యత లేదో! అరకులోకంటె ఇందులో లేనిదే ముందంటారు ?"

"అరకు అంటే ఈ ప్రాంతాలన్నింటినీ కలిపి అంటారేమో ! వీటి రెండింటికంటె అనంతగిరిలో సౌందర్యాలు జాస్తి .... మీరు బస్ రూట్‌లో రాలేదు కదూ ! అనంతగిరికూడా చాలా బాగుంటుంది. చిక్కటి, పచ్చటి అడవిలో కాఫీ తోటలు అవీ ...."

"నేను బస్‌రూట్ మిస్ అయిపోయాను" అప్పుడే గుర్తొచ్చింది నాకాసంగతి. కేవ్స్‌లో మరోపూట గడపబోతున్న ఉషారులో ఆ సంగతి పూర్తిగా మర్చిపోయాను నేను. మా ప్లేన్ రిటర్న్‌జర్నీ బస్‌లో చేయాలని.

"పరవాలేదులెండి మీరు చెప్పినదాన్నిబట్టిచూస్తే బస్‌రూట్‌కంటె ట్రెయిన్ రూటే అందంగా వుండేలా వుంది. అఫ్‌కోర్స్ దేని అందం దాందే అనుకోండి" అని నన్ను ఓదార్చాడు మాధవ్.

"పోనీండి, మీరు చెప్పండి వింటాను."

నా వైపు చూసాడు మాధవ్ తలత్రిప్పి –

"అంటే ...."

"అదే .... మీరు కారులో వచ్చేప్పుడు ...."

"ఓ. అదా...." అని నవ్వి.

"పదండి కేవ్స్‌లో కూర్చుని చెప్పుకుందాం" అన్నాడు.

* * *

గుహ పూర్తిగా చూడడం పూర్తయ్యాక, మాధవ్ నిన్న కూర్చుని. తలెత్తిచూసి, పరవశంగా నన్ను పిల్చి ఆ అందమైన దృశ్యాన్ని చూపిన స్థలంలో కూర్చుంటూ అన్నాడు.

"కారుణ్యగారూ! నేనూ, పాపా ఇక్కడే వుంటాము మీకేం భయం

వుండదిక్కడ. చక్కగా కథ వ్రాసుకోండి" ఆ గుహపైన ఓ పెద్ద రంధ్రం దానిగుండా కొంత వెల్తురు మామీద పడుతోంది మిగతా అంతా చీకటి.

నేను మౌనంగా, ఇంకా దిగువకొచ్చి, కుడివైపుగా దిగి, అక్కడ వున్న తెల్లటి బండరాళ్ళమీద కూర్చున్నాను. నన్ను భావావేశం కుదిపేస్తోంది. చీకటి వెలుగుల ఆ సౌందర్యం నన్ను చుట్టేస్తోంది. నేను నా ప్రపంచంలో కెళ్ళిపోయాను.

* * *

"ఇక వెళ్దామాండీ...."

నాకు కాస్త ఎత్తులో నిలబడి మాధవ్ అడుగుతున్నాడు. నేను ఉలిక్కిపడి తలెత్తాను. నా ఊహాజనిత ప్రపంచంలోనుండి, మరలా ఆ చీకటి గుహాలతాలూకు అందాలలోకి, అపూర్వమైన మాధవ్ స్నేహంలోకి వచ్చేసాను. నేను మొదట ఇక్కడ కూర్చుని వ్రాయడం ప్రారంభించినంత వెల్తురు ఇప్పుడు లేదు. అంటే, బహుశ బయట సూర్యాస్తమయం అయ్యుంటుంది.

నిజానికి నేనెప్పుడు కథలు మొదలెట్టినా, ఏదో అంతరాయం కలుగుతూనే వుంటుంది. అందుకని అవి ముక్కలు ముక్కలుగా మిగులుతుంటాయి. ఈ రోజు ఇంచుమించు యాభై పేజీలదాకా నా కలం ఆగలేదు.

"ఇంకా పూర్తి కాలేదా ? పోనీ ఇంకో అరగంట కూర్చుందామా ? మీకు భయం లేదుగా చీకటిపడితే. నా దగ్గర సిగర్ లైటరుంది. ఆ కాంతిలో వెళ్ళిపోవచ్చు."

నేను లేచి నిలబడ్డాను. గైడ్ కుర్రాడు వెళ్ళిపోయినట్టున్నాడు.

"పదండి వస్తున్నాను."

అతను చెయ్యి అందించాడు. నేను ఆ రాళ్ళ గుట్టమీదనుండి చల్లనైన ప్రదేశంలోకొచ్చి అతని ప్రక్కనే మెల్లెక్కసాగాను.

నడుస్తూ, నడుస్తూ కాంతివచ్చే భాగంవైపు తలెత్తి చూస్తూ అన్నాడు మాధవ్.

"ఈ మధ్య ఓ ఆవు పరుగెడ్తూ ఆ రంధ్రంలోనుండి క్రిందపడి పోయిందట కారుణ్యగారూ ! మాంసపు ముద్దగా మాత్రమే మిగిలిందట"

నా ఒళ్ళు జలదరించింది. 'అదే పరిస్థితుల్లో మనముంటే' వణికి పోతూ మాధవ్ చెయ్యి పట్టుకున్నాను అతను నావైపు ఆప్యాయంగా చూసాడు.

"భలేవారే .... అలా అయిపోయారేమిటీ ?"

నేను చెయ్యి వదిలేసాను. పాపాయ్ నన్ను చూసి నవ్వుతోంది. దానికీ కాస్త భావుకత వున్నట్లుంది. వాళ్ళ అమ్మ, నాన్నలాగ మమ్మల్ని ఏమీ ఇబ్బంది పెట్టలేదు.

ముగ్గురం గుహ బయటకొచ్చేసరికి మమ్మల్ని మరోసారి అనంతమైన ఆనందంలో ముంచుతూ ఆ చల్లటి వాతావరణంలో మా క్రిందుగా జలజలపారే సెలయేరు ....

"ఇక్కడ కాసేపు కూర్చుంటారా ?"

"ఇక్కడ కాసేపు కూర్చుందామా ?" అని నేనడక్కముందే మాధవ్ అన్నాడు.

నేను వెంటనే అక్కడే కూర్చున్నాను. నా ప్రక్కన మరో మెట్టు మీద మాధవ్ కూర్చున్నాడు. మాధవ్ ఒడిలో పాపాయ్. ముగ్గురం మౌనంగా మసక వెల్తురులో సెలయేటి అందాలు చూస్తున్నాం ....

"మీకు చిత్రంగా లేదూ ? ఈ వయస్సులో నేనిలా పసిపిల్లలా, సిల్లీగా ప్రవర్తిస్తుంటే" ఉలిక్కిపడ్డట్టు చూచాడు మాధవ్.

"కారుణ్యగారూ ! ప్లీజ్ మీరెప్పుడూ అలాంటి అనారోగ్యమైన

భావానికి మీ మనసులో చోటివ్వకండి. మన వయస్సుగురించి మనం కొన్ని సమయాల్లో మర్చిపోవాలి. లేకపోతే మనలో చైతన్యం చచ్చిపోయి, నైరాశ్యం మిగులుతుంది. మనిషికి అనవసరమైన హద్దులు అంత ఆరోగ్యకరమైనవి కావు."

అతనలా చెపుతుంటే, నేనతనితో, మనస్ఫూర్తిగా ఏకీభవించాను. కానీ పైకిమాత్రం మాట మారుస్తూ అన్నాను.

"మా పాపాయ్ మిమ్మల్ని ఏమీ విసిగించలేదు కదా !"

"లేదు ... లేదు. మీ వారసురాలు మీ పాపాయ్ అసలింతవరకు నా దగ్గరలేదు. గైడ్ పిల్లాడితో జలపాతం దగ్గర కూర్చునుంది. మనం రాబోయేముందే పాపను నాకు అప్పజెప్పి వాడు వెళ్ళింది కూడాను."

నేను కళ్ళెత్తి అతని కళ్ళల్లోకి చూసాను. అవి మామూలుగా వున్నాయి.

"మీరు మీ కారు ప్రయాణం గురించి చెప్తానన్నారూ?..." అతను చిరునవ్వు నవ్వాడు. "పదండి చీకటి పడుతోంది నడుస్తూ చెప్పుకుందాం."

"విశాఖపట్టణం నుండి మిర్యాగూడ వరకు నేను చాలా నిరాశపడ్డాననే-చెప్పాలి. మిర్యాగూడ అంటే మనమిప్పుడు బస్‌లో వెళ్ళాలంటే బొర్రానుండి, మిర్యాగుండా బస్‌స్టాండ్‌కెళ్ళి బస్ ఎక్కాలన్నమాట."

నేను అతనిని మధ్యలో ఆపేసాను.

"రైల్లో అలా కాదండీ. ఇంచుమించు సింహాచలం తర్వాతనుండి అన్నీ అందాలే !"

"అవునట. నాకూ ఎవరో చెప్పారు, అందుకనే కారు అటు పంపించేసింది. రేపు మీతో వద్దునుగానీ, పాపం మా వాడితో గడిపిందే లేదు. ఎల్లుండి వస్తాను."

"చెప్పండి."

"ఉండండి. దారి అంతగా కన్పించడం లేదిక్కడ. సిగర్ లైటర్ వెలిగిస్తాను."

అతని ప్రక్కన మా బాధ్యతని పూర్తిగా అతనికి అప్పజెప్పేసినట్టు ధైర్యంగా నడుస్తున్న నేను ముసురుకుంటున్న చీకటిని గమనించ లేదు. పాపాయ్ కూడా నిశ్శబ్దంగా నా ప్రక్కన నడుస్తోంది.

"అనంతగిరి, సుంకరమెట్టు ప్రదేశాల్లో కార్లో స్లోగా వెళ్తుంటే, చాలా బాగుంటుంది కారుణ్యగారూ! వాటి రెండింటికి మధ్యగావున్న గాలి పర్వతంమీద సౌందర్యాలు మనల్ని మరిక ముందుకు పోనివ్వవు. అక్కడ కొచ్చేసరికి మిట్టమధ్యాహ్నమయినా, చల్లటిగాలి, పచ్చటి పరిస రాలు చుట్టేసి మనల్నక్కడ నిలిపేస్తాయి. ఆ తర్వాత సుంకరమెట్ట, బిల్లుగూడ, బోసుచెడ్డ, బెంజిహూడు, సానిరంగని అన్నీకూడా పచ్చగానే వుంటాయి. అరకులో ఎంటర్ అయ్యేప్పటికి మనంమరో లోకంలో వుంటాం."

"లోయలు అవీ కన్పించవా?"

"ఎందుకు కన్పించవండీ? చాలా భయంకరమైన లోయలు. మీ రైలు రూటుకంటె బస్ రూటు మరీ ఎత్తులో వుంటుంది కదా! ...."

"ఎందుకనీ...."

రైలు కొండలను చీల్చుకుంటూ, వాటిలో త్రవ్వబడిన టన్నెల్స్ గుండా కదూ పోతుంది. బస్ అలాకాదు. కొండ శిఖరాలమీద కొండల్ని చుట్టుకుంటూ పోవాలి."

"నిజమే!"

మేమలా మాట్లాడుకుంటూ గుట్టదిగి రైలు పట్టాలమీద కొచ్చేసాం.

చీకటి పూర్తిగా దిగంతాల నాక్రమించింది. సిగరెట్ లైట్ తాలూకు ఆ చిన్న కాంతిలో, మేము ముగ్గురం ఒంటరిగా ఒకరి ప్రక్కన ఒకరం నడుస్తున్నాం మమ్మల్ని మెల్లి మెల్లిగా చలి ఆక్రమించుకుంటోంది. టైమ్ చూడడానికి ప్రయత్నించాను, కనబడలేదు.

"ఆరయ్యుండొచ్చు" అన్నాడు మాధవ్.

"ఎలుగుబంట్లు వస్తాయేమో" అన్నాను సరదాగా నవ్వుతూ.

"మీ కా భయమేమీ అక్కరలేదు. ఈ పైపు నడవండి మీరు " అంటూ తను తప్పుకుని, నన్ను రైలు పట్టాలవైపుగా మార్చి తను లోయ ప్రక్కన నడవసాగాడు. అంతవరకు మాకు శ్రమ ఇవ్వకుండా నడుస్తున్న పాపాయ్ నేను ఎలుగుబంటి ప్రసక్తి తేగానే,

"నాకు భయమేస్తోంది ఆంటీ" అంటూ ఏడుపుముఖం పెట్టి 'నన్నెత్తుకోమ'ని గొడవచెయ్యసాగింది.

"రా పాపా నే నెత్తుకుంటాను" అని మాధవ్ అనీ అనగానే చప్పున అతనిని చుట్టుకుంది పాపాయ్.

"వద్దు, వద్దు. ఇలారా నే నెత్తుకుంటాను" అన్నాను..

"మీరు పాపనెత్తుకోగలరా ? మీరు నడవండి చాలు" అని నవ్వి పాపాయ్ నెత్తుకుని,

"మీ కింకా నా దగ్గర మొహమాటం పోలేదు" అన్నాడు మాధవ్.

'నా దగ్గర మీ కింకా మొహమాటం పోలేదు' అన్న అతను మానసికంగా మరో మెట్టు నా దగ్గరగా వచ్చేసాడు.

మా కెదురుగా దూరాన కాగడా కాంతి.

"మా వాడయ్యుంటాడు" కరెక్ట్‌గానే గెస్‌చేసాడు మాధవ్.

"భలేవాడివే....అమ్మాయిని తీసుకెళ్ళి ఇంత ఆలస్యంగానా రావడం ?...." అంటూ ఎదురుపడగానే కేకలేసాడు ఎ.యస్.యమ్. గారు.

"ఆయనదేమీ తప్పులేదండీ. నాదే ఆలస్యమయింది" అన్నాను స్నేహితునిమీదకి నింద రానివ్వకుండా,

స్నేహితుని కోపానికిగానీ, నా సంజాయిషీకిగాని జవాబు చెప్ప లేదు మాధవ్. ఆ మసక వెల్తురులోగూడా అతని పెదాలమీద చిరునవ్వు స్పష్టంగా తెలుస్తోంది.

"మీరు వంటగాని చేసేసారా ?"

"లేదులెండి" అని నవ్వారాయన నా కంగారుకు.

నిజంగానే ఆయనీసారి వంట చేయలేదు. వంటకు కావాల్సిన సామాగ్రి కూరగాయలు సిద్ధంగా వుంచిపెట్టారంతే. నేను రాంగానే వంటింట్లో దూరి నా ప్రయోగం మొదలెట్టాను.

* * *

"మీకేమయినా సాయం కావాలా ?" నేను వెనక్కుతిరిగి చూసాను. వంటింటి వాకిట్లో రెండు చేతులూ ద్వారబంధానికి పైన ఆనించి నిల్చొనున్నాడు మాధవ్.

"రా. అంకుల్. ఈ ఆకు తుంచాలట" అని తన కొత్త స్నేహితుణ్ణి ఆహ్వానించి, నేను తనకి అప్పజెప్పిన పనిని మాధవ్‌కి అప్పజెప్పింది పాపాయ్.

నేను "వద్దు వద్దు" అని వారించే లోపలే అతను పీటమీదకూర్చుని ఆకు శుభ్రం చేయసాగాడు.

నేను తలవంచి పనిచేస్తున్న అతనిని చూస్తూ కూర్చున్నాను.

'విశాఖపట్నంలో ఓ గొప్ప హోదాలో వున్న ఆ యువకుడు అలా ఆ మారుమూలపల్లెలో ఆ చిన్న వంటఇంట్లో ఓ అపరిచిత యువతిప్రక్కన కూర్చుని ఆకు పలుస్తున్నాడు !'

"కారుణ్యగారూ !" నేను స్పృహలో కొచ్చాను.

"మీరు, పూర్తిచేయని మీ కథ గురించి ఆలోచిస్తున్నట్టున్నారు. ఇంకో గంటముందు మనం వెళ్ళగలిగుంటే బాగుండేది !"

"ఫర్వాలేదులెండి. ట్రెయిన్‌లో పూర్తి చేస్తాను."

## 9

"తినగలుగుతున్నారా ?" అని నవ్వాను.

"చాలా బాగుందమ్మా !" అని ఎ. యస్. యమ్.గారు మాటలతో మెచ్చుకుంటే, బాగుందన్నట్టు కళ్ళతో చెప్పాడు మాధవ్.

"ఏవీ బాగలేదు" అని తేల్చి పారేసింది మా పాపాయ్.

"నాకు నైట్‌డ్యూటీ వుంది. మీకు భయంలేదుగా. లేకపోతే తోడు ఎవరినైనా పంపమంటారా ?"

మాధవ్ మాట్లాడలేదు.

"భయమెందుకండి మాధవ్‌గారున్నారుగా" అన్నాను నేను.

చిత్రంగా ఆ అపరిచిత యువకునితో ఒంటరిగా ఆ రాత్రి ఆ ఇంట్లో, ఆ మారుమూల పల్లెలో గడపబోతున్నాననే భయమే నాలో కలగలేదు.

ఆ రాత్రి ఎ. యస్. యమ్.గారి పడకగదిలో పాపాయ్‌ని ప్రక్కలో

వేసుకుని రగ్గు కప్పుకుని నిశ్చింతగా పడుకున్నాను. కానీ వివిధమైన భావావేశాలమధ్య పది దాటినా నాకు నిద్ర రాలేదు. మాధవ్ సిట్టింగ్ రూములో ఏం చేస్తున్నాడో నాకు తెలీదు. ఎ. యస్. యమ్. గారు, వెళ్ళిపోయాక నాకు పడక చూపించి,

"మీరు, పాప అక్కడ పడుకోండి. భయమేంలేదు. నే నీ ఈజీ ఛెయిర్‌లో పడుకుంటాను" అని చెప్పేసి వెళ్ళిపోయాడు.

ఆ రూములో లైట్ వెలుగుతోంది కానీ, ఎలాటి శబ్దాలు రావడం లేదు. పాపాయ్ మాత్రం హాయిగా నిద్రపోయింది.

నేను మధుర స్మృతులను నెమరువేసుకుంటున్నాను. 'అరకువేలీలో ఆర్ అండ్ బి క్వార్టర్సుప్రక్క కొండలైట్ రాళ్ళమీద మాధవ్‌తో నా పరిచయం, బొటానికల్ గార్డెన్స్‌లో ఒంటరిగా మే మిద్దరం....బొర్రా కేవ్స్‌లో అతనితో నేను. తనను పరవశింపజేసిన అందాల్ని, అతను నాతో పంచుకోవడం నే నెంత చనువిచ్చినా, అతిగా, అసభ్యంగా ప్రవర్తించని అతనంటే నాకు స్నేహభావం కలగడంలో చిత్రం ఏమీలేదు. ఆనాడు అరకులో, మేంగనీసు మోసుకొచ్చే రైలు చూడాలనే కుతూహలంలో నా ప్రక్కగా వచ్చి,

'నేనీ రాయిమీద కూర్చుంటే మీ కేమయినా అభ్యంతరమా ?' అని అడిగి నా పక్కన ఆ కొండరాళ్ళమీద కూర్చున్న అతని కళ్ళల్లోని గౌరవ భావాన్నే నేను ఈనాడు, ఇన్ని రోజుల స్నేహం తర్వాత కూడా అతని కళ్ళల్లోచూస్తున్నానంటే....అతనిపైస్నేహభావం, మమకారం పెరగకుండా ఎలా వుంటాయి ?

"అతను పాపం ఈ చలిలో ఏం కప్పుకున్నాడో ఏమో !" ఇక నిద్ర పట్టలేదు.

మెల్లిగా లేచాను. షాపాయ్ షాల్ తీసి అతనికిచ్చే ఉద్దేశంతో, అతని రూమ్‌లో అడుగుపెట్టి దిగ్భ్రాంతితో నిల్చిపోయాను. ఆ అర్ధరాత్రి అతను కుర్చీలో కూర్చుని, టేబుల్‌లైట్ కాంతిలో ఏదో చిత్రం గీస్తున్నాడు. నేను లేచి వచ్చిన శబ్దం కూడా అతని ఏకాగ్రతను భంగం చేయలేకపోయింది.

చప్పుడు చేయకుండా అతనికి మరింత దగ్గరగా వచ్చి నిల్చున్నాను.

అతను చిత్రకారుడని నా కింతవరకు తెలీదు.

బొర్రాకేవ్స్‌లో నన్ను పరవశంగా పిల్చి చెయ్యి పట్టుకుని తన స్థలంలో కూర్చోబెట్టుకుని తల పైకెత్తి చూపించిన దృశ్యమది.

ఓ భయంకరమైన గుహ దాని ఉపరితలం చీకటి వెలుగుల కలయికలో, వేపచెట్టు ఆకాశం, నక్షత్రాలు అని భ్రమింపజేసేలా అద్భుతంగా కుదిరిందా చిత్రం.

నేను మరీ దగ్గరగా వెళ్ళడంతో మాధవ్ తలెత్తి చూసాడు.

"అరెఁ మీరింకా నిద్రపోలేదా ? కాసేపు పడుకోండి ఫ్రెష్‌గా వుంటుంది. ప్రయాణం నాలుగ్గంటలకు మా బాబివచ్చి లేపుతానన్నాడు."

నేను దానికి జవాబు చెప్పలేదు.

"మీరింత మంచి చిత్రకారులని నాకు తెలియనే తెలీదు."

"మంచి చిత్రకారులా ?" అని నా మాటను రెట్టిస్తూ నవ్వాడు.

"చాలా బాగుంది" మనస్ఫూర్తిగా మెచ్చుకున్నాను.

"థాంక్స్! కూర్చోండి నిలబడే వున్నారు" అని నాకు ఈజీ ఛెయిర్ చూపించాడు.

"ఫరవాలేదు. మీరు ఫైనల్ టచప్ ఇవ్వండి. నేనలా బయట కాసేపు నిల్చుని వస్తాను" అని షాల్ కప్పుకుని బయలుదేరాను.

"ఏం భయంలేదుగా" అని వుండండి. నేను కుర్చీ అలా వాకిలికెదురుగా వేసుకుంటాను. మీరు ఆ పచ్చికలో కూర్చోండి" అంటూ కుర్చీ సర్దసాగాడు.

నేను బయటకు నడిచి చలికి ముడుచుకుపోయాను.

*　　　*　　　*

అతను బోర్రాకేవ్స్ ప్లాట్‌ఫారంమీద .... నేను ఆర్. ఆర్. ఎక్స్ప్రెస్‌లో ఫస్ట్‌క్లాస్ కంపార్టుమెంటు మొదటిమెట్టుమీద .... మాధవ్ నాకు చిరునవ్వుతో వీడ్కోలు చెపుతున్నాడు.

అనంతమైన తృప్తి వెనుక సన్నటి ఆవేదన.

"ఇది మీ పిల్లలకివ్వండి" అన్నాను. పాపాయ్ కొరకు కొన్న బిస్కట్ పేకెట్స్ మిగిలిపోయినవి వుంటే అవి అతని చేతికిస్తూ—

వాటిని అందుకుంటూ, "కారుణ్యగారూ ! మీరు మీ శ్రీవారిని తీసుకుని ఎప్పుడైనా మా అతిధులుగారండి. మిమ్మల్ని మరోసారి ఇక్కడకు తీసుకొస్తాను నేను" అన్నాడు మాధవ్.

నేను నిట్టూర్చాను.

"మా కారుణ్యకింకా తృప్తిలేదు. మా తమ్ముడు ఎలా భరిస్తున్నాడో ఏమోగానీ" అని జోక్ చేసింది వదిన.

ఆర్.ఆర్.ఎక్స్ప్రెస్ నన్ను ఈ ప్రకృతినుండి ప్రియమైన మాధవ్ స్నేహాన్నుండీ విడదీస్తూ కదిలింది.